## ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని పూర్తిగా చదవలేదు : రాహుల్



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ కచ్చితంగా రాజ్యాంగాన్ని చదవలేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని చదవలేదన్న గ్యారెంటీ


Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

బుధవారం, నవంబర్ 27, 2024 | సంపుటి - 20 | సంచిక 59 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.







# ఇచ్చిన మాట ప్రకారం కులగణన

## కులగణనతోనే ఆర్థిక, సామాజిక న్యాయం



**తెలంగాణలో ఇచ్చిన మాట ప్రకారం కుల గణన చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, దళితులకు, ఆదివాసులకు భూ చట్టాలు తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. భారత్ జోడో యాత్ర పేరిట రాహుల్ గాంధీ అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ వారి ఇబ్బందులు తెలుసుకున్నారని అన్నారు.**

## రాహుల్ మాట మేరకు తెలంగాణలో విజయవంతం

## ఎఐసిసి సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో సిఎం రేవంత్

న్యూఢిల్లీ :

రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు గాంధీ పరివార్ ఉందని.. రాహుల్ గాంధీకి అండగా తాము ఉన్నామని వ్యాఖ్యా నించారు. రైతుల తరఫున నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ అందోళన చేశారని.. అందుకే కేంద్రం నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందని వివరించారు. తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా కులగణన చేపట్టింది. కొన్ని చోట్ల ఇప్పటికే ప్రజల నుండి వివరాలు నమోదు చేసుకుంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సర్వేను పర్యవేక్షిస్తూ సర్వే సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్వేలో మొత్తం 85 వేల మంది ఎన్యుమరేటర్లు, 8,500 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటున్నారు. ఇంటి నంబరు, యజమాని పేరు నమోదు చేసే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొంటున్నారు. ప్రతి కుటుంబంలో సభ్యులందరి ఫోన్, ఆధార్ నంబర్లు సహా సమస్త వివరాలతో కూడిన 75 ప్రశ్నలను అడిగి నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 1,17,44,954 కుటుంబాలున్నాయని.. ఇళ్లను 87,092 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించి 2లో



# తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి

## త్వరగా మూడింటి అభివృద్ధికి చర్యలు

## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం చర్యలు

## త్వరగా పూర్తి చేస్తామని హామీ

**రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాల గురించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.. ముఖ్యంగా వరంగల్ ఎయిర్ పోర్టు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.**

న్యూఢిల్లీ : భూ సేకరణ ఎంత తొందరగా పూర్తయితే.. అంత త్వరగా ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణాలు చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు. దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశమయ్యారు. పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి 2లో

## గెలిస్తే..సరేసరి.. లేకుంటే ట్యాంపరింగా?

### కెఎ పాల్ పిటిషన్‌పై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ : గెలిస్తే ఇవిఎంలు మంచివి.. లేకుంటే చెడ్డవా అంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈవీఎంలను రద్దుచేసి దేశవ్యాప్తంగా ఎన్నికల్లో మళ్లీ బ్యాలెట్ విధానాన్ని తీసుకుని రావాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్ దాఖలు చేశారు. 2లో

# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ భారీ విజయం ఖాయం

**రేవంత్ రెడ్డి సీఎం పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదే**

**ఢిల్లీవాళ్లకు కోపం వస్తే ఆయన పదవి ఊడుతది**

**ప్రజల దగ్గరకు పోతే జనాలు సీఎంను ఛీ కొట్టే పరిస్థితి**

**కొడంగల్‌లో రైతులకు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి రేవంత్‌ది**


**సిరిసిల్లలో దీక్షాదివస్ సన్నాహక కార్యక్రమంలో కేటీఆర్**



సిరిసిల్ల : ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే బీఆర్ఎస్ భారీ విజయం సాధించడం ఖాయమని కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో దీక్షాదివస్ సన్నాహక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి సీఎం పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదేనని.. ఢిల్లీ వాళ్లకు కోపం వస్తే ఆయన పదవి ఊడుతదన్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమని.. కానీ నాలుగేళ్లు వేచి చూడాల్సిందేనన్నారు. సిరిసిల్లలో ప్రజలు ఛీ కొట్టిన సరే అధికారులను అడ్డం పెట్టుకొని ఎగురుతున్న కాంగ్రెస్ సన్నాసులను గుర్తుపెట్టు కుంటామన్నారు. మొన్న సీఎం వేములవాడకు వచ్చాడని.. నాలుగు మంచి మాటలు చెబుతాడను కున్నానన్నారు. బాలల దినోత్సవమైనా, రాజీవ్ సద్భావన యాత్ర అయినా, ఆయన పుట్టిన రోజు అయినా.. వేములవాడలో మీటింగ్ అయినా సరే కేసీఆర్‌ను తిట్టటమే పని అని.. దేవుళ్ల మీద ఒట్లు, హామీలకు తూట్లు, కేసీఆర్‌పై తిట్లు ఇవి తప్ప నువ్వేం పీకినవ్ అంటూ మండిపడ్డారు. ప్రజల దగ్గరకు పోతే జనాలను సీఎంను ఛీ కొట్టే పరిస్థితి ఉందన్నారు. కొడంగల్ లో రైతులకు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి రేవంత్‌ది అంటూ విమర్శించారు.నేరెళ్లలో ఒక సంఘటన జరిగిందని.. బాధితులకు న్యాయం చేసేందుకు తాను ప్రయత్నం చేశానన్నారు. వాళ్లను కలిశానని.. వీలైనంత వరకు సాయం చేశానన్నారు. మీరు రాజకీయం చేసే ప్రయత్నం చేశారని.. మిగతా 2లో

## డిజైన్ లేకుండానే సుందిళ్ల బ్యారేజీ 2ఏ బ్లాకు నిర్మాణం

### జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజినీర్ల వెల్లడి



హైదరాబాద్ : సుందిళ్ల బ్యారేజీలోని 2ఏ బ్లాకును డిజైన్ లేకుండానే నిర్మాణం ప్రారంభించినట్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజినీర్లు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు మంగళవారం 16 మంది క్షేత్రస్థాయి ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు.

## డిసెంబర్ 4న పెద్దపల్లిలో సీఎం విజయోత్సవ సభ..

**నియామక పత్రాలు అందజేయనున్న సీఎం**

**9 వేల మంది అభ్యర్థులకు అందజేసే అవకాశం**

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై గ్రూప్ 4 తో పాటు వివిధ పరీక్షల్లో రిక్రూటైన 9 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తుండటంతో పెద్దపల్లిలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందుకు పెద్దపల్లి జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లాలో పర్యటిస్తారు. ఆ రోజు నిరుద్యోగ యువతితో భారీ బహిరంగ సభ నిర్వహించి ఇటీవల వివిధ పోటీ పరీక్షల్లో మిగతా 2లో

# జర్నలిస్టులకు ఇళ్లస్థలాల వ్యవహారం

## కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలకులదే పాపం

## మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్ : జేఎన్‌జే జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన ఇండ్ల స్థలాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పును వెలువరించడం అత్యంత బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ విషయంపై మంగళవారం హైదరాబాద్‌లో బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు దక్కకపోవడానికి పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ పాలకులే ప్రధాన కారణమని విమర్శించారు. 7 ఏళ్ల క్రితం పుస్తెలు తాకట్టు పెట్టి, అప్పు చేసి ఒక్కో జర్నలిస్టు రూ.2 లక్షల చొప్పున రూ.12 కోట్లు పోగు చేసి ప్రభుత్వానికి చెల్లించి జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ పేరుతో స్థలాలు దక్కించుకున్నారని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఏదో ఒకసాకు చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు చేతికి అందించకుండా తీవ్రమైన అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో జర్నలిస్టుల బతుకులు మరీ దుర్భరంగా ఉన్నాయని వాపోయారు.

# మాగనూరుస్కూల్లో వికటించిన మధ్యాహ్న భోజనం

## 21మంది విద్యార్థులకు అస్వస్థత..

## వారం రోజుల్లో వరుసగా రెండో ఘటన

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



నారాయణపేట : నారాయణపేట జిల్లా మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మరోసారి మధ్యాహ్న భోజనం వికటించి 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు రోజు మాదిరిగానే మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం తిన్న తర్వాత 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో వెంటనే వారిని మాగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గత బుధవారం ఇదే పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు కారణాలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో మురళీధర్‌రెడ్డి, భోజన నిర్వహణ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బాపురెడ్డిలను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యా సంచాలకుడు ఈవీ నర్సింహారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆ పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేశారు. ఆ ఘటన మరువక ముందే మరో 21 మంది విద్యార్థులు

## ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని పూర్తిగా చదవలేదు : రాహుల్

ఇవ్వగలనని అన్నారు. ఒకవేళ ఆయన ఈ పుస్తకాన్ని చదివి ఉంటే, ప్రతి రోజు ఇలాంటి పనులు చేసేవాడు కాదు అని రాహుల్ అన్నారు. సంవిధాన్ రక్షక్ అభియాన్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిందని, కులగణన అనేది సమాజానికి మెగా హెల్త్ చెకప్ లాంటిందని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించేది గాంధీ కుటుంబం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. మేం అంతా ఆ కుటుంబం వైపు మద్దతుగా ఉన్నామన్నారు.

## డిజైన్ లేకుండానే సుందిళ్ల బ్యారేజీ 2ఏ బ్లాకు నిర్మాణం

గతంలో వారు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన డిజైన్లు, నాణ్యతకు సంబంధించిన అంశాలపై డీఈ, ఏఈఈలను జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు.రెండో బ్లాక్‌ను పరిగణనలోకి తీసుకొని సుందిళ్ల బ్యారేజీ 2ఏ బ్లాక్ నిర్మాణాన్ని డిజైన్ లేకుండానే ప్రారంభించినట్లు ఇంజినీర్లు తెలిపారు. అప్పటి చీఫ్ ఇంజినీర్ ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. డిజైన్లు లేకుండా పనులు ఎలా చేపడతారని జస్టిస్ పీసీ ఘోష్ ఆక్షేపించారు. కొందరు ఇంజినీర్ల సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషన్ ఛైర్మన్.. తప్పుదోవ పట్టించవద్దని స్పష్టం చేశారు. అఫిడవిట్‌లో ఒక సమాచారం, విచారణలో మరొక సమాచారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ విచారణలో ప్రమాణం చేసి అబద్ధం ఎలా చెబుతారని మండిపడ్డారు. అలా చేస్తే చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పనులకు సంబంధించిన ప్లేస్మెంట్ రిజిస్టర్లు, మెజర్మెంట్ బుక్స్ పై ఇంజనీర్ల సంతకాలు తీసుకొన్న కమిషన్ వాటిని స్వాధీనం చేసుకొంది. బుధవారం మరో 18 మంది ఇంజనీర్లను కమిషన్ విచారించనుంది.

## మాగనూరు స్కూల్లో వికటించిన మధ్యాహ్న భోజనం

ఆసుపత్రి పాలు కావడం గమనార్హం. నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ జరగడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫుడ్‌పాయిజన్ జరిగి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పది రోజులు కూడా గడవకముందే మళ్లీ ఫుడ్‌పాయిజన్ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ జరగడంపై హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫుడ్‌పాయిజన్ జరిగి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పది రోజులు కూడా గడవకముందే మళ్లీ ఫుడ్‌పాయిజన్ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాంతులు, కడుపునొప్పితో 30 మంది విద్యార్థులు జిల్లా దవాఖానాలో చేరిన దుస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కనీస చర్యలకు ఉపక్రమించడం లేదని విమర్శించారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని అన్నారు. మాటలే తప్ప చేతలు లేని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య తీరు వల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలవ్వాలని.. ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలని ప్రశ్నించారు.

## డిసెంబర్ 4న పెద్దపల్లిలో సీఎం విజయోత్సవ సభ..

ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపికైన 9 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. అందుకు భారీ బహిరంగ సభకు అనువైన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులతో కలిసి పెద్దకల్వల లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. సభా స్థలాన్ని పరిశీలించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవం వేడుకలను డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 9 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణంలో జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. అందులో భాగంగా డిసెంబర్ 4న పెద్దపెల్లి జిల్లాలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరుపుతుందని తెలిపారు. నిరుద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై గ్రూప్ 4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సీఎం టూర్ ప్రజా పాలన విజయోత్సవ సభ సందర్భంగా ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ పెద్దకల్వలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు వెంటనే జరిగేలా చూడాలని ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని త్వరగా కాంటా వేసి కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం డబ్బులు రైతులకు సకాలంలో చెల్లించేలా వివరాలను ఓపిఎంఎస్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## గత పదేళ్లలో రైల్వే శాఖలో 5లక్షల మందికి ఉద్యోగాలు

**రానున్న కాలంలో మరిన్ని ఉద్యోగాల కల్పన**

**రైల్వే చరిత్రలో తొలిసారిగా వార్షిక రిక్రూట్‌మెంట్ క్యాలెండర్**

**కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి**

న్యూఢిల్లీ : పదేళ్లలో రైల్వే శాఖ 5లక్షల ఉద్యోగులను రిక్రూట్ చేసుకుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు.. గత దశాబ్ద కాలం (2014 -2024) లో రైల్వే శాఖ ఐదు లక్షల మంది ఉద్యోగులను రిక్రూట్ చేసిందని, ఇది అంతకుముందు దశాబ్దం (20042014) కంటే ఎక్కువగానే ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం తెలిపారు. నాగ్‌పూర్‌లోని అజనీ రైల్వే గ్రౌండ్‌లో జరిగిన ఆల్ ఇండియా ఎస్సీ/ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ సదస్సులో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం 12,000 జనరల్ కోచ్‌లు ఉత్పత్తిలో ఉన్నాయని, రానున్న కాలంలో మరిన్ని ఉద్యోగాలు ఇస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. 2004 %-% 2014 మధ్య రైల్వే రిక్రూట్‌మెంట్ సంఖ్య 4.4 లక్షలు అని మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. భారతీయ రైల్వే చరిత్రలో తొలిసారిగా వార్షిక రిక్రూట్‌మెంట్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టడాన్ని కూడా ఆయన హైలైట్ చేశారు. ఇది అంతకుముందెన్నడూ జరగలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బిఎల్ భైరవ, సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ధరమ్‌వీర్ మీనా, సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ నీను తదితరులు పాల్గొన్నారు. పార్లమెంటులో అడుగుపెట్టే ముందు రాజ్యాంగానికి తలవంచాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంజ్ఞను కూడా వైష్ణవ్ అభినందించారు. రాజ్యాంగం పట్ల గౌరవం ప్రతీకాత్మకతకు మించినది.. అది ఆయన చర్యలో ప్రతిబింభిస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కృషిని స్మరించుకునే సావనీర్‌ను వైష్ణవ్ ఆవిష్కరించారు. ముందుగా దీక్షాభూమిలోని సెంట్రల్ మెమోరియల్ వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రెండు రోజుల సదస్సు ఇవ్వాల్టితో ముగియనుంది.

# ఇచ్చిన మాట ప్రకారం కులగణన

కులగణన చేపట్టినట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ తెలిపారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్?తోనే సాధ్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో అందరికి సామాజిక న్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితర కీలక నేతలు హాజరయ్యారు. దేశంలో రాజ్యాంగ పవిత్రతను కాపాడింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. గాంధీ పరివార్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తుంటే.. మోడీ పరివార్ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్ని ÷ర్ అయ్యారు. రాజ్యాంగ పరిరక్షణలో రాహుల్ గాంధీ వెంట దేశ ప్రజలంతా ఉన్నారన్నారు. ప్రతి ఒక్క వర్గానికి కాంగ్రెస్ పార్టీ న్యాయం చేసిందని.. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు కాపాడింది కాంగ్రెస్సేనని వ్యాఖ్యానించారు. కుల గణనతోనే ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని.. ఇందుకోసమే దేశవ్యాప్తంగా కుల గుణన కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని తెలిపారు. దేశంలో సామాజిక న్యాయాన్ని అందించింది ఒక్క కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట ప్రకారమే తెలంగాణలో కుల గణన చేపట్టామని.. కుల గణన సర్వే ఇప్పటి వరకు 92 శాతం పూర్తి అయ్యిందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జన గణన సర్వేలోనూ కులాల లెక్కలు తీయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

## తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి

కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలోనే వరంగల్ విమానాశ్రయాన్ని నూటికి నూరుపాళ్లు పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. వరంగల్‌తోపాటు మరో మూడు.. పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తమను కోరారన్నారు. అయితే పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం విషయంలో ఫీజిబిలిటీ స్టడీ చేయాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించిన నివేదిక సానుకూలంగా వస్తే.. అనంతరం భూసేకరణకు వెళ్ల వచ్చని ఆయన చెప్పారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం మాత్రం రక్షణ శాఖ పరిధిలో ఉందని గుర్తు చేశారు. ఆ శాఖ నుంచి అనుమతి వస్తే.. ఆదిలాబాద్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అదీకాక ఆదిలాబాద్‌కు ఓ వైపు చత్తీస్‌గఢ్, మరోవైపు మహారాష్ట్రలు సరిహద్దులు ఉన్నాయన్నారు. దీంతో ఆ దరిదాపుల్లో విమానాశ్రయం లేదని గుర్తు చేశారు. అక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేస్తే చాలా మందికి ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. మరోవైపు వరంగల్ విమానాశ్రయం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రో యాక్టివ్‌గా వ్యవహరిస్తూ.. భూసేకరణకు ఇప్పటికే సర్క్యులర్ సైతం జారీ చేసిందని ఆయన వివరించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా వరంగల్‌లో విమానాశ్రయాన్ని నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. ఢిల్లీ పర్యటన కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ సోమవారం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా గడుపుతున్నారు. మంగళవారం ఉదయం కేంద్ర పౌర విమానాయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. అంతకుముందు పౌర విమానయాన శాఖ మంత్రి కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి విచ్చేయడంతో.. ఆయనకు ఎదురేగి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇద్దరు ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత తన కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలను కేంద్ర మంత్రి శాలువాలతో సత్కరించి.. తిరుమల శ్రీవారి ప్రతిమలను వారికి అందజేశారు. అనంతరం వారు.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతోపాటు ఆ శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటుకు అనుమతితోపాటు వరంగల్ విమానాశ్రయం అంశాలపై వారు కులంకుషంగా చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులను సైతం సీఎం రేవంత్ రెడ్డి కలవనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు,నిధులు తదితర అంశాలను ఈ సందర్భంగా వారితో సీఎం చర్చించనున్నారు.

## ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ భారీ విజయం ఖాయం

నెరేళ్ల ప్రజలంతా మొన్నటి ఎన్నికల్లో మాకే అత్యధిక ఓట్లు వేశారన్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులు అంటే ప్రజలతో తిట్లు తిన్నా సరే వారి మనసు గెలుచుకునే ప్రయత్నం చేయాలంటూ చురకలంటించారు. కొడంగల్‌లో రైతులు ఏం అడిగారు.. తమ భూములకు ఎక్కువ డబ్బులు ఇవ్వాలని కోరారన్నారు. తొమ్మిది నెలలుగా నిరసన చేస్తున్నారని.. ధర్నాలు చేస్తున్నారన్నారు. అయినా వాళ్లకు సీఎం సమయం ఇవ్వలేదన్నారు. సీఎం తమ్ముడు, మంత్రులు ఎవ్వరూ వాళ్లు బతిమాలినా పట్టించుకోలేదన్నారు. ఆఖరికి కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణకు వెళితే నిరసన తెలిపారని.. అదే రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి.. ఉరికించి కొట్టేవారన్నారు. సీఎం కేవలం అదానీ, తన అన్న, అల్లుడు, బావమరిదికి అమృతం పంచేందుకు మాత్రమే పని చేస్తున్నాడని.. ప్రజల కోసం ఏమీ చేయలేదంటూ మండిపడ్డారు. 28 సార్లు ఢిల్లీకి పోయిండని.. ఫ్లైట్ ఛార్జీలు వృథా తప్ప 28 రూపాయలు కూడా తీసుకురాలేదనన్నారు. ఎనిమిది 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని.. వారంతా 8 రూపాయల నిధులు లేదన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న పనులను గమనిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో ఓ ఆటో డ్రైవర్‌తో మాట్లాడితే ఈ ప్రభుత్వం పోయేందుకు ఏదైనా ఉపాయం లేదా అడుగుతున్నాడన్నారు. ఒకసారి ఓటు వేస్తే ఐదేళ్లు శిక్ష పడాల్నా అంటున్నాడని.. తప్పదు మరో నాలుగేళ్లు వీళ్లు పీక్క తింటూనే ఉంటారన్నారు. ఈ ముఖ్యమంత్రికి కనీస అవగాహన, పరిజ్ఞానం కూడా లేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సిరిసిల్లలో నేతన్నలు ఉన్నారని.. మరి ఇక్కడ పెట్టాల్సిన నూలు డిపోను తీసుకొని పోయి వేములవాడలో పెట్టిండంటూ ప్రశ్నించారు. గుండుకు దెబ్బ తాకితే మోకాలి మందు పెట్టినట్లుగా ఉందన్నారు. ఇంతా తెలివైన వాళ్లు ఉండటం మన అదృష్టమన్నారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రిని ప్రజలు ఇన్ని తిట్లు తిట్టటం నేను ఎప్పుడు చూడలేదన్నారు. మీడియా, యూట్యూబ్ వాళ్లు మైక్ పెడితే చాలు ఏమాత్రం సంకోచించకుండా రేవంత్ రెడ్డిని పొట్టు పొట్టు తిడుతున్నారన్నారు. ఆ తిట్లు విన్నాక రేషం ఉన్నోడైతే బిల్డింగ్ మీది నుంచి దూకి చస్తాడన్నారు. కానీ, రేవంత్ రెడ్డి కాబట్టి నడిచిపోతోందన్నారు. ఏడాదిలోపే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఊహించలేదన్నారు. మనం పిలుపునిస్తే ఈ ప్రభుత్వానికి ప్రజలే సంవత్సరీకం పెట్టే పరిస్థితి ఉందన్నారు. అమ్మ విలువ, అన్నం విలువ లేనప్పుడే మనకు తెలుస్తుందన్నారు. అదే విధంగా ఇప్పుడు గ్రామ గ్రామాన కేసీఆర్ గురించే మాట్లాడుతున్నారు. హైదరాబాద్‌లో నాచారంలోని చెప్పుల దుకాణం, హుజుర్‌నగర్‌లో నాయీ బ్రహ్మణుడి షాప్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలగిస్తుంటే వాళ్లు కేసీఆర్ ఎక్కడ ఉన్నావంటూ గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఎప్పుడు ఎలక్షన్ వస్తుందా? కాంగ్రెస్ ను ఎప్పుడు పాతర పెడదామా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. 2001 నుంచి ఇక్కడ జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండానే ఎగిరిందని.. మళ్లీ బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. ప్రజల్లో కేసీఆర్ పట్ల ఎనలేని వాత్సల్యం, ప్రేమ ఉందన్నారు. దాన్ని ఎలా అనుకూలంగా మలుచుకోవాలన్నదే మనం చేయాల్సిన పనన్నారు. మనుషులుగా మనం కూడా తప్పులు, పొరపాట్లు చేసి ఉండవచ్చని.. వాటి నుంచి ఏం నేర్చుకున్నామన్నదే ముఖ్యన్నారు. ఆనాడు 'కేసీఆర్ సచ్చుడో%ా%తెలంగాణ తెచ్చుడో' అని కేసీఆర్ ఏ విధంగా తెలంగాణ తెచ్చారో గుర్తు చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ స్ఫూర్తితో కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా మహా సంకల్ప దీక్ష చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ తెచ్చిన దానికన్నా కేసీఆర్‌కు వచ్చే పెద్ద పేరు ఇంకేమీ లేదన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు, తెలంగాణ రైతులు, నేతన్నలు, వృద్ధులు, తెలంగాణ ప్రజానీకానికి మేలు జరగాలంటే కేసీఆర్ కావాలన్నారు. విడిపోతే.. చెడిపోతాం అంటూ మొన్న మహారాష్ట్ర ఎన్నికల్లో ఒక నినాదం బాగా పాపులర్ అయ్యిందని.. మనం కూడా ఎన్నికలు వస్తే విడిపోకుండా జాగ్రత్త పడాలని.. లేకపోతే అన్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ మీద గులాబీ జెండాకు ఉన్న ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉండదని.. కేసీఆర్ మాత్రమే తెలంగాణ మట్టి మనిషి అవుతాడని.. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీ మనుషులేనన్నారు. మన నాయకుడి పోరాటం, తెలంగాణ విద్యార్థుల బలిదానాన్ని దీక్షా దివస్ సందర్భంగా మరోసారి గుర్తు చేసుకోవాల్సి ఉందన్నారు. ఆనాడు తెలంగాణ ఇయ్యాక తప్పని పరిస్థితిని తీసుకొచ్చింది కేసీఆర్ అని.. నవంబర్ 29, 2009 నాడు కేసీఆర్ అనే బక్క మనిషి, ఉక్కు సంకల్పంతో చేపట్టిన దీక్ష కారణంగానే తెలంగాణ సాధ్యమైందని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటైన జూన్ 2వ తేదీ ఎంత ముఖ్యమో.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలక మలుపు అయిన దీక్షా దివస్ నవంబర్ 29 అంతే ముఖ్యమన్నారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వ తేదీ వరకు పదకొండు రోజులు జరిగిన దీక్ష కారణంగా అనివార్యంగా తెలంగాణ ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఏ రోజైతే తెలంగాణ ప్రకటన వచ్చిందో అదే డిసెంబర్ 9వ తేదీని విజయ దివస్‌గా జరుపుకుందామన్నారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు హెచ్చరికలు జారీ చేశారు. బీఆర్ఎస్ నాయకులను పార్టీ మారాలని చెబుతున్నారట అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు రాజ్యాంగ దినోత్సవమని.. బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఆర్టికల్-3 ద్వారానే తెలంగాణ సాధ్యమైందన్నారు. అందుకే తెలంగాణ ప్రజలంతా ఆయనకు రుణపడి ఉంటారన్నారు. ఆయన చూపిన బాటలోనే బోధించు, పోరాడు, సమీకరించు అన్న విధానంలోనే కేసీఆర్ పోరాటం చేసి తెలంగాణ సాధించారని గుర్తు చేశారు.

## ఉపాధ్యాయుల గణాంకాలపై సర్కారు ఫోకస్

**సర్కారు బడుల్లో టీచర్ల లెక్కలు తీస్తున్న అధికారులు**

హైదరాబాద్, : రాష్ట్రంలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల గణాంకాలపై తెలంగాణ సర్కారు ఫోకస్ పెట్టింది. బడిలో పిల్లలకు ఉన్న టీచర్లకు పొంతన ఉందా లేదా అనే దానిపై విద్యాశాఖ అధికారుల ఆరా తీయగా సంచలన విషయాలు బయటపడ్డాయి. ఈ ఏడాది విద్యాసంవత్సరంలో దాదాపు 2 వేల పాఠశాలల్లో ఒక్క స్టూడెంట్ కూడా చేరలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. విద్యాశాఖ అధికారుల లెక్కల ప్రకారం రాష్ట్రంలో2024-25 సంవత్సరానికి గాను 1899 బడుల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదైంది. ఈ పాఠశాలల్లో అప్పటికే 580 మంది టీచర్లు ఉన్నారు. ఎవరైనా స్టూడెంట్స్ చేరకపోతారా అని ఎదురుచూసిన విద్యాశాఖకు నిరాశ ఎదురుకాగా పిల్లలు లేని స్కూల్స్‌లో టీచర్లు ఏం చేస్తారని వారిని ఇతర స్కూల్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తెలంగాణలో మొత్తం 26,101 పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది విద్యార్థుల బడిబాట తర్వాత ఏ స్కూల్‌లో ఎంతమంది చేరారు. ఎంతమంది స్టూడెంట్స్ ఉన్నారు అనే లెక్కలు అధికారులు తీశారు. 1899 పాఠశాలల్లో ఒక్కరు కూడా చేరలేదు. ఇందులో 1818 ప్రాథమిక పాఠశాలలు కాగా.. 48 యూపీఎస్, 33 హైస్కూల్స్ ఉన్నాయి. పదిమందిలోపే పిల్లలున్న పాఠశాలలు 4 వేల 314 ఉన్నాయి. అందులో 3326 మంది టీచర్లు పాఠాలు చెబుతున్నారు. ఒక స్టూడెంట్ నుంచి 10 మంది వరకు ఉన్న పాఠశాలలు 2415 , 2746 టీచర్లు పని చేస్తున్నారు. రాష్ట్రంలో హైస్కూల్స్‌లో స్టూడెంట్స్ తక్కువగా ఉన్నా విద్యాప్రమాణాలపై ఎఫెక్ట్ పడకుండా ఉండటం కోసం సబ్జెక్టులకు సరిపడా టీచర్స్‌ను కొనసాగిస్తున్నారు.

## గెలిస్తే..సరేసరి..లేకుంటే ట్యాంపరింగా?

ఈ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈవీఎం విధానాన్ని రద్దు చేసి తిరిగి పేపర్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ కేఏ పాల్ పిటిషన్ దాఖలు చేశారు. విదేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ విధానాన్నే అనుసరిస్తున్నారని, భారత్ కూడా దాన్నే కొనసాగిస్తే బాగుంటుందని అన్నారు. అంతేకాకుండా.. ఎన్నికల సందర్భంగా దేశంలో రూ.వేల కోట్లలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. 'ఇక్కడ ఏం జరుగుతోంది. మీరు గెలిస్తే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయలేదు అంటారు. ఓడిపోతే మాత్రం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందంటారు. బ్యాలెట్ విధానాన్ని అనుసరించిన మాత్రాన అవినీతి ఆగిపోతుందని మీరు చెప్పగలరా?' అని ప్రశ్నించింది. అనంతరం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది.

## జర్నలిస్టులకు ఇళ్లస్థలాల వ్యవహారం

ఇండ్ల స్థలాలడిగితే లాఠీలతో కొట్టించారని ఆక్షేపించారు. ప్రశ్నించే జర్నలిస్టులను వారి వృత్తిలో కొనసాగకుండా అడుగడుగునా అవమానించిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని బండి సంజయ్ గుర్తుచేశారు. 'బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్య ఫలితమే నేటి సుప్రీంకోర్టు తీర్పు. ఈ రెండు పార్టీలు జర్నలిస్టులను రోడ్డు పాల్జేయడమే కాకుండా చేతికి వస్తుందని వేయికళ్లతో ఎదురు చూసిన ఇండ్ల స్థలాలను చేతికి అందకుండా చేశాయి. జర్నలిస్టుల నోటికాడ ముద్దను లాగేసుకున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుతో జర్నలిస్టు కుటుంబాల బాధ వర్ణణాతీతం. అసలు జర్నలిస్టులు చేసిన తప్పేమిటి. ఈ రెండు పార్టీలకు జర్నలిస్టులపై ఎందుకంత కక్ష. పైసాపైసా కూడబెట్టి డబ్బులు చెల్లించినా ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా 17 ఏళ్లు జాప్యం చేస్తారా. నేటి సమాజంలో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి. చాలీచాలని జీతాలతో బతుకీడుస్తున్నారు. అయినా తమ వార్తలతో నిరంతరం సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు అహర్నిశలు తపన పడతున్నారు. ప్రభుత్వం వాళ్లకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా అన్యాయం చేస్తోంది. వాళ్లకు హెల్త్ కార్డులు కూడా పనిచేయడం లేదు. ఉండటానికి ఇండ్లు లేక అ÷-దదె కట్టలేక, పిల్లల ఫీజులు కూడా చెల్లించే స్థోమత లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కుటుంబం కంటే సమాజాన్ని చైతన్యవంతం చేయడమే ప్రధానమని నమ్మి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూసి ఎంతోమంది జర్నలిస్టులు అసువులు బాశారు. జర్నలిస్టులను ఆదుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తీవ్రంగా విఫలమయ్యాయి' అని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇకనైనా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు బాధాకరమే అయినప్పటికీ ప్రభుత్వం తనకున్న విచక్షణ అధికారాలను ఉపయోగించి జర్నలిస్టులకు ఇండ్లను కేటాయించాలి. అలాగే గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఇండ్లులేని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వానికి భారతీయ జనతా పార్టీ పక్షాన పూర్తిగా సహకరించేందుకు సిద్ధం. అలాగాకుండా ఇండ్ల స్థలాలివ్వకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తే తాము చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. జర్నలిస్టులతో కలిసి మహోద్యమానికి కార్యాచరణ రూపొందిస్తాం. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పట్టిస్తాం. అదే సమయంలో జర్నలిస్టులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బీజేపీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లోని జేఎన్జే హౌసింగ్ సొసైటీ జర్నలిస్టులతోపాటు రాష్ట్రంలోని అర్హులైన విలేకరులందరికీ ఇండ్లను కేటాయిస్తాం' అని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

## జూనియర్ లెక్చరర్ ఎకనామిక్స్ ఫలితాలు విడుదల

హైదరాబాద్ : తెలంగాణ జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే కొన్ని సబ్జెకుల ఫలితాలు వెల్లడైన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా జేఎల్ ఎకనామిక్స్ ఫలితాలను టీజీపీఎస్సీ తాజాగా విడుదల చేసింది. ఎకనామిక్స్, ఎకనామిక్స్ ఉర్దూ మీడి యం పోస్టులకు ఎంపికైన వారి ఫలితాలను ప్రకటించింది. ఇందుకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. మరోవైపు జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టుల భర్తీలో భాగంగా ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతుంది. నేడు మరి కొంతమంది అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ ఓ ప్రకటనలో ప్రకటించింది. బోటనీ, హిందీ, తెలుగు, జువాలజీ అభ్యర్థులకు మంగళవారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వెరిఫికేషన్‌ను నిర్వహిస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ఈ రోజు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు గైర్హాజరైన వారికి ఈ నెల 27న (బుధవారం) రిజర్వ్‌డేలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్ష ఫీజు కట్టవల్సిన గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. నవంబర్ 27వ తేదీతో తుది గడువు ముగియనుండగా.. దానిని డిసెంబర్ 3వ తేదీ వరకు పొడిగించినట్టు బోర్డు కార్యదర్శి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.100 ఆలస్య రుసుముతో డిసెంబర్ 12వ తేదీ వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 17వ తేదీ వరకు, రూ. 1000 ఆలస్య రుసుముతో డిసెంబర్ 24, రూ.2000 ఆలస్య రుసుముతో జనవరి 1 వరకు పరీక్ష పీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.జేఈఈ మెయిన్స్ తొలి విడతకు దరఖాస్తు ప్రక్రియ ముగిసిన సంగతి తెలిసిందే. దరఖాస్తుల్లో దొర్లిన తప్పుల సవరణకు నవంబర్ 26, 27 తేదీల్లో అవకాశం ఇస్తున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ రోజు, రేపు వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్ ద్వారా తప్పులను సవరించుకోవచ్చని తెలిపింది.

# శ్రీ సీతారామంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు

- ప్రజల అభీష్టం మేరకు దేవాదాయ శాఖ పరిధిలో సీతా రామంజనేయ స్వామి దేవాలయం
- సబ్బితం సీతారామంజనేయ ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మాత్యులు కొండా సురేఖ

**పెద్దపల్లి ప్రతినిధి ( ది క్రైమ్ న్యూస్ ):** పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామం లోని శ్రీ సీతా రామాంజనేయ స్వామి దేవాలయాన్ని 50 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మాత్యులు కొండా సురేఖ అన్నారు. మంగళవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మాత్యులు కొండా సురేఖ సబ్బితం సీతారామంజనేయ ఆలయ అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు లతో కలిసి శంకుస్థాపన చేశారు. పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి విచ్చేసిన రేఖకు ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీ సీతా రామాంజనేయ స్వామి వారిని దర్శించుకున్న మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు మంత్రి, ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు సబ్బితం గ్రామంలో ఉన్న శ్రీ సీతా రామాంజనేయ స్వామి దేవాలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖలో విలీనం చేసుకుని 50 లక్షల రూపాయలతో అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశామని, వీటిని సకాలంలో నాణ్యతతో పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని మంత్రి పేర్కొన్నారు. సబ్బితం గ్రామంలోని ఆలయానికి పూర్వపు చరిత్ర ఉందని, ఇక్కడ విగ్రహాలు పక్కన ఊరి వారు తీసుకుని వెళ్తే , మళ్లీ తీసుకుని వచ్చి ప్రతిష్టించి ఆలయం నిర్మించడం జరిగిందని , ఎక్కడ శ్రీ సీత, రామ, ఆంజనేయ స్వాములతో పాటు ఈశ్వరుడు, నవగ్రహాలను కూడా ప్రతిష్టించారని, సబ్బితం గ్రామానికి నమ్మకమైన ఆలయంగా శ్రీ సీతా రామాంజనేయ స్వామి ఆలయం ఉందని



అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఆలయాన్ని దేవదాయ శాఖలో కలపాలని కోరిన మేరకు దేవాదాయ శాఖ లో విలీనం చేసి అభివృద్ధికి నిధులు మంజూరు చేసే శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ సబ్బితం గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన దేవదాయ శాఖ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లిలో అనేక దేవాలయాలు ఉన్నాయని, ఓదెల మల్లి కార్జున స్వామి దేవాలయానికి మంత్రిని తీసుకువెళ్లి స్వామి దర్శనం చేయించి ఆలయ అభివృద్ధి గురించి చర్చించాలని భావించినప్పటికీ మంత్రి సబ్బితం గ్రామానికి రావడం చాలా సంతోషకరమని అన్నారు. సబ్బితం దేవాలయం పురాతనమైన ఆలయం అని, ఎక్కడ పురాతన ఆంజనేయస్వామి ఉండే వారిని, వారికి ఆలయం నిర్మించేందుకు భూమి ఇవ్వడమే కాకుండా నిర్మాణంలో కూడా పాలు పంచుకున్న ప్రజా ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ట జరిగి సంవత్సరం గడిచిందని, మిగిలిన అభివృద్ధి పనుల పూర్తి చేసేందుకు 50 లక్షల రూపాయలు మంత్రి





కేటాయించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# దీక్ష దివాస్‌కు జిల్లా నలుమూలల నుండి తరలి రావాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈనెల 29 తేదీన చేపట్టే దీక్షా దివస్ కు జిల్లా నలు మూలల నుండి తరలి రావాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధ్యక్షతన పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ 29 న జరిగే దీక్షా దివాస్ కు జిల్లా నలుమూలల నుండి భారీగా తరలి రావాలని కోరారు. ఒక్క చుక్క రక్తం కారకుండా తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన ఘనత కేసీఆర్ కు దక్కిందన్నారు. పాదయాత్రలు, రహదారుల దిగ్బంధం, రాస్తారోకోలు, ఎన్నో నిరసనలతోనే ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. దేశమే ఆచర్యపోయే విధంగా జరిగిన ఆనాటి ఉద్యమాన్ని గుర్తుచేసు కోవడానికే దీక్షా దివాస్ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదని, కాంగ్రెస్ చేస్తున్న మోసాల పై గ్రామాల్లో చర్చ పెట్టాలన్నారు. మళ్ళీ బిఆర్ఎస్ కు పూర్వ వైభవం రావాలంటే గడపగడపన చర్చ జరగాలని అన్నారు. ఉద్యమంలో కెసిఆర్ కరీంనగర్ లో నిర్వహించిన సింహగర్జన కు జనాలు స్వచ్ఛందంగా వచ్చారని గుర్తు చేశారు. మళ్ళీ ఆ రోజులు రావాలి, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ శ్రేణులు, మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# భూనిర్వాసిత కుటుంబ వారసులకు ఉద్యోగాలివ్వాలి

## - టెక్నికల్ పోస్టులను తమకే కేటాయించాలి - ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి - ఎన్టిపిసి భూనిర్వాసిత కమిటీ డిమాండ్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ముప్పైఆరేళ్ళ క్రితం ఎన్టిపిసి సంస్థ నిర్మాణం కొరకు భూములను ఇచ్చి ప్రస్తుతం వయోభారంతో ఉన్న కుటుంబ వారసులతో భర్తీ చేయాలని ఎన్టిపిసి భూనిర్వాసితుల వెల్ఫేర్ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈనెల 29న ఎన్టిపిసిలో కొత్త ప్రాజెక్టు ఏర్పాటులో భాగంగా జరగబోయే ప్రజా అభిప్రాయ సేకరణకు ముందే ఎలాంటి షరతులు లేకుండా ఇంటికో ఉద్యోగం ప్రకటించాలని కోరారు. ప్రస్తుత ప్రాజెక్టులో 450ఖాళీలు ఉన్నాయని, 8,9,10 తరగతులు చదివిన వారికి టెక్నికల్ ట్రయినింగ్ ఇప్పించి ఐటిఐ చదివిన వారితో సమానంగా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ మేరకు



ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టరుకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు వారు వివరించారు. ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు పొన్నం శంకరయ్య, ప్రధాన కార్యదర్శి ఖాజా అజీముద్దిన్, ఉపాహ్యక్షుడు గాండ్ల రాజయ్య, బూర్ల ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఎన్నికబీ భూనిర్వాసితుల వెల్ఫేర్ కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొన్నం శంకరయ్య, ఉపాధ్యక్షుడిగా గాండ్ల రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా ఖాజా అజీముద్దిన్, సహాయ కార్యదర్శిగా బయ్యపు ప్రభంజనరెడ్డి, రాములు ముఖ్య సలహాదారుడిగా కొమురయ్య, వడ్డెపల్లి రామచందర్, భూర్ల ధనుంజయ్, రాజేష్, సమ్మయ్య, రంగారెడ్డి, భూమయ్య, తోటరవి, నారాయణ, రమేష్ ఎన్నికయ్యారు.

# బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీ డీ ఓ



**లక్షెట్టిపేట, నవంబర్ 26(క్రైమ్ న్యూస్ ):** పట్టణంలోని స్థానిక ప్రభుత్వ దళిత బాలుర వసతి గృహాన్ని ఆ శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి వాకబు చేశారు. అంతేకాకుండా వసతి గృహంలో వినియోగిస్తున్న ఆహార పదార్థాలు, వసతి గృహానికి సరఫరా అవుతున్న నిత్యావసర సరుకుల నాణ్యత గురించి వసతి గృహ సంక్షేమాధికారి రాజు ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేవలం నాణ్యమైన సరుకులనే ఆహారంలో వినియోగించాలని, ప్రభుత్వం నుంచి సంబంధిత కాంట్రాక్టర్ లకు బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని డీ డీ వివరించారు. ఆహార పదార్థాల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. స్టాక్ రూమ్ ను సందర్శించి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చలి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వసతి గృహ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో డీ డీ వెంట వసతి గృహ సంక్షేమాధికారులు రాజు, రాజు కుమార్, సిబ్బంది ఉన్నారు.

# రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా వ్యాసరచన, ఉపన్యాస పోటీలు...




**కరీంనగర్ టౌన్, నవంబర్26(ది క్రైమ్ న్యూస్):** భారతరాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిల్లీ డిఫెన్స్ కాలేజీలో యువతరం యూత్ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా జిల్లా యువజన అధికారి వెంకట రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులందరూభారత రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకొని, బాధ్యత కలిగిన పౌరులుగా మెలగాల న్నారు. నేరాల నిర్మూలనకు, అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కళాశాల చైర్మన్ కొత్త సతీష్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఎంతోమంది మహనీయులు ప్రాణా త్యాగం చేశారన్నారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో భాగస్వామ్యమైన వారిని ఆదర్శంగా తీసుకొని భావితరాలకు మనం ఆదర్శప్రాయంగా ఉండాలని, దేశ నిర్మాణంలో యువత విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీలో పాల్గొన్న విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, యువజన సంఘాల నాయకులు తోర్తి శ్రీనివాస్, నక్క ప్రమోద్, సాయి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు...



జమ్మికుంట నవంబర్ 26 (ది క్రైమ్ న్యూస్): పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై ద్విచక్ర వాహనం, ట్రాలీ ఢీకొని భార్య భర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం కు చెందిన మొలుగుగరి రాజేష్, స్రవంతికు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి 108 చేరుకొని క్షతగాత్రులను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్స అనిదించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

# తప్పులు లేకుండా సర్వే ఫారాలను ఆన్లైన్ చేయాలి

## - ముత్తారం ఎంపిడిఓ సురేష్

**ముత్తారం. నవంబర్. 26. (ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఫారాల ఆన్లైన్ చేసే ప్రక్రియను ఎంపీడీవో సురేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగవంతంగా ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, సర్వే ఫారాలను తప్పులు లేకుండా ఆన్లైన్ చేయాలని సూచించారు. కంప్యూటర్ ఆపరేటర్లు సర్వే ఫారాల ఆన్లైన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని కోరారు.



## సంపాదకీయం

### ఇందుగలడు..అందు లేడని లేదు..

# సర్వం అదానీ!

రాజకీయంగా దేశంలో రెండవ అతి పెద్ద రాష్ట్రం మహారాష్ట్రలో భారీ విజయ సాధించటంతో భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఆనందోత్సహాలు జరుపుకుంటున్నాయి. ఇదే సమయంలో కేంద్రంలోని అధికార పార్టీకి అదానీ వ్యవహారం తల నొప్పిగా మారింది. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీకి గత కొన్నేళ్లుగా అదానీ విషషయంలో ప్రతిపక్షాల నుంచి అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఇప్పుడు అమెరికాలో గౌతమ్ అదానీపై క్రిమినల్ కేసు నమోదు కావటంతో ఇక్కడ ప్రధానీ మోడీ పరిస్థితి ఇరకాటంలో పడ్డట్టైంది. పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజే ఉభయసభల్లో గందరగోళం చెలరేగింది. దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ద్వారా విచారణ జరిపించాలని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. పార్లమెంటులో దీనిపై చర్చకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించింది. ఈ గందరగోళం మధ్య ఉభయ సభలు వాయిదాపడ్డాయి, తగిన వివరణ వచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. అదానీ విషయంలో ప్రభుత్వ తీరును ఆప్, తృణమూల్ కాంగ్రెస్ వంటి ఇతర పార్టీల ఎంపీలూ తప్పుబట్టారు. అదానీ కంపెనీలు కేంద్ర బిందువుగా గత నాలుగైదు రోజులుగా దేశవ్యాప్తంగా దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. ఇక, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ రాజకీయం అదానీ వ్యవహారం చుట్టే నడుస్తోంది. ఏపీ, తెలంగాణలో ఇప్పుడు ఈ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా పత్రికా సమావేశంలో.. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం విరాళం సేకరించడంపై కొందరు పాత్రికేయులు రాహుల్‌గాంధీని అడిగారు. ఒకపక్క సీఎం రేవంత్‌రెడ్డి విరాళాలు సేకరిస్తుంటే.. మరోపక్క మీరు ఎలా అదానీ తప్పులను ప్రశ్నిస్తారని రాహుల్ వద్ద ప్రస్తావించారు. ఇది తెలంగాణలో చర్చనీయమైంది. అదానీ విషయంలో తను గతంలోనే నేను వివరణ ఇచ్చానని... రాహుల్ కూడా అదానీపై తన పోరాటాన్ని విస్పష్టంగా ప్రజలకు వెల్లడించారని సీఎం రేవంత్ రెడ్డి చెబుతూ వస్తున్నారు. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఏదైనా అంశంలో టెండర్లు పిలిస్తే.. అదానీనే కాదు.. అంబానీ, టాటా, బిర్లా వంటి వారు ఎవరైనాసరే.. నిబంధనల ప్రకారం ఆ టెండర్లను దక్కించుకుంటే.. వారికి రాజ్యాంగబద్ధమైన రక్షణ ఉంటుందని, వారు పెట్టుబడులు పెట్టడానికి అవకాశం ఉంటుందని రాహుల్‌గాంధీ స్పష్టంగా వివరించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ పదే పదే అదానీ విరాళం వ్యవహారాన్ని ప్రస్తావిస్తోంది. దీంతో సీఎం రేవంత్ రెడ్డీ గులాబీ నేతలపై ఎదురుదాడికి దిగారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అదానీ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలు చాలానే ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. అంతే కాదు 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి అదానీ గ్రూప్ ఇస్తాన న్న రూ.100 కోట్ల విరాళాన్ని తెలంగాణ ప్రభుత్వం స్వీకరించడానికి సిద్ధంగా లేదని సీఎం ప్రకటించారు. పక్క రాష్ట్రాలు, దేశాల్లో అదానీ గ్రూప్ కంపెనీల విషయంలో జరుగుతున్నవివాదానికి.. తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు. క, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో కూడా అదానీ-జగన్ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. ఈ వ్యవహారంపై అధికార టీడీపీ ఎలా వ్యవహరిస్తుంది అనేది ఆసక్తిని కలిగిస్తోంది. రాష్ట్రంలో జగన్ రాజకీయ ప్రత్యర్థి కాగా..కేంద్రంలో బీజేపీ మిత్రపక్షంగా ఉంది. మెడీ, అదానీ అత్యంత సన్నిహితులు అనే విషయం బహిరంగ రహస్యమే. ఇప్పుడు దీనిపై పార్లమెంట్లో టీడీపీ ఎలా వ్యవహరిస్తుందో చూడాల్సి వుంది. కాగా. అదానీతో ఒప్పందానికి సంబంధించి జగన్‌మోహన్‌రెడ్డి తేలుకుట్టిన దొంగలా వ్యవహరిస్తున్నారని లెఫ్ట్ పార్టీలు మండిపడుతున్నాయి. ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై రూ. లక్ష కోట్ల భారం పడుతుందని విమర్శిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా దీనిపై విమర్శలు చేసిన తెదేపా నాయకులు ఇప్పుడు నోరెత్తకపోవటం విచిత్రంగా ఉంది. ఒప్పందంలో రూ. 2,029 కోట్ల అవినీతి ఉందని, అందులో రూ. 1,757 కోట్లు జగన్‌కు అందినట్లు అమెరికా న్యాయవిభాగం తేల్చిన విషయం తెలిసిందే. యూనిట్ రూ. 1.99కు వచ్చే విద్యుత్తును రూ. 2.49 చొప్పున కొనడానికి ఎందుకు ఒప్పందం చేసుకున్నారనేది ఆరోపణ. టీడీపీ సర్కార్ జగన్‌పై కనీస విచారణకు సిద్ధపడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మౌనం వీడి జగన్‌పై చర్యలు తీసుకోవాలి. మరోవైపు, అదానీ కేసులో ఇప్పుడు మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. గౌతమ్ అదానీతో పాటు ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీకి యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (యూఎస్ ఎస్ఈసీ) సమన్లు జారీ చేసింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులను పొందడానికి రూ.2,200 కోట్లు లంచం ఇచ్చారన్న ఆరోపణలపై తమకు వివరణ ఇవ్వాలని కోరింది. 21 రోజుల లోపు సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది.నోటీసులకు స్పందించకపోతే తీర్పు వ్యతిరేకంగా వెలువడుతుందని యూఎస్ ఎస్ఈసీ హెచ్చరించింది. అదానీ వ్యవహారంలో ఆరోపణలు రుజువైతే..ఇటు ప్రజాకోర్టులో కూడాచాలా మందికి శిక్షలు తప్పవు!!

# మహాయుతిలో ముఖ్యమంత్రి పంచాయితీ



హారాష్ట్ర సీఎం పదవిపై ఢిల్లీ పెద్దల కసరత్తు కొనసాగుతోంది. కానీ ఇప్పటి వరకు సీఎం పదవి కోసం పడిన పీటముడి వీడలేదు. చివరకు ఇది మహాయుతిలో ముసలం పుట్టిస్తుందా అనే అనుమానాలకు కలిగిస్తోంది. బిజెపి- శివసేన మధ్య విభేదాలు వచ్చే అవకాశం ఉన్నదా అనే అనుమానాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి ముఖ్యమంత్రిగా ఉన్న శివసేన నేత ఏక్‌నాథ్ షిండే, భాజపా తరఫున గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉన్న దేవేంద్ర ఫడణవీస్ ఇద్దరూ కూడా ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి కోసం గట్టిగా పోటీపడుతున్నారు. కూటమి చీలికను ఎవ్వరూ కోరుకోవడం లేదు గానీ.. అనివార్యమైన పరిస్థితి వస్తే.. ఆ సంభావ్యతను తోసిపుచ్చలేమని పరిశీలకులు భావిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో అత్యధికంగా 132 సీట్లలో విజయం సాధించింది. మహాయుతి కూటమిలో కూడా వారి వాటా ఎక్కువ. కాబట్టి వారికే ముఖ్యమంత్రి పదవి దక్కాలనేది పలువురి వాదన. ఏక్‌నాథ్ షిండేకు ఒక అవకాశం ఇచ్చారు గనుక.. ఇప్పుడు ఆయన కూడా అవకాశం బిజెపికి ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని కొందరు అంటున్నారు. రాష్టాన్ని ముందుకు తీసుకెళ్లే సత్తా ఫడణవీస్ కు ఉన్నదని ఆ పార్టీ వారు గట్టిగా పట్టుపడుతున్నారు. అయితే శివసేన వాదన ఇంకో రకంగా ఉంది. ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా ఉండగా తీసుకున్న నిర్ణయాలు, అందించిన సుపరిపాలన కారణంగానే మహాయుతి కూటమి ఘనవిజయం సాధించిందని, ఆ వియాన్ని తోసిపుచ్చలేమని వారు అంటున్నారు. కాబట్టి షిండేనే కొనసాగించాలనేది వారి వాదన. షిండేని పక్కకు తప్పిస్తే గనుక.. భారతీయ జనతా పార్టీ మిత్ర పక్షాలను వాడుకుని, తాము బలపడిన తర్వాత వారిని కరివేపాకులు వాడుకుని వదిలేస్తుందని అనేక మంది చేసే ఆరోపణలే నిజమౌతాయని వారు చెబుతున్నారు. తద్వారా బిజెపిని డిఫెన్సులోకి నెడుతున్నారు. బలాబలాల ప్రకారంగా చూస్తే భారతీయ జనతా పార్టీకి 132 మంది సభ్యులున్నారు. అదే సమయంలో ఎన్సీపీకి ఉన్న బలం 41 స్థానాలు. శివసేన(షిండే) 57 స్థానాలలో గెలిచింది. పరిస్థితులు వికటిస్తే గనుక.. శివసేన లేకుండా కూడా ఎన్సీపీ మద్దతుతో భాజపా ప్రభుత్వం ఏర్పాటు చేయగలుగుతుంది. అయితే అలాంటి నిర్ణయం భాజపాకు అపరిమితమైన చెడ్డపేరు తెచ్చిపెడుతుంది. వారి విశ్వసనీయత దెబ్బతింటుంది. అందుకే కేంద్రంలోని పెద్దలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. షిండే, ఫడణవీస్ ఇద్దరూ గట్టిగా పట్టుపడుతున్నందువల్ల.. మంగళవారమే కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావల్సి ఉండగా.. ఇంకా నిర్ణయం జరగలేదు. రాజీ కుదరకపోతే మైత్రిలో ముసలం పుడుతుందని కొందరు అంచనా వేస్తున్నారు.

# సీఎం కావాలనేది లోకేష్‌కు చిటికెలో పని!



టీడీపీ యువనేత సీఎం అవుతారా? ఈ అంశం గురించి చర్చకు ఇది సమయం కాకపోవచ్చు. ఎందుకంటే ఎన్నికలు జరిగి ఆరు నెలలు కూడా పూర్తి కాలేదు. అసలు లెక్క ప్రకారం చూస్తే.. వచ్చే ఎన్నికలు 2029 లో జరగాల్సి ఉంది. అప్పటికి ఇంకా చాలా సమయం ఉంది. అయితే డిప్యూటీ సీఎం హోదాలోని పవన్ కల్యాన్ రాబోయే పది సంవత్సరాలూ సీఎంగా చంద్రబాబు నాయుడే ఉండాలని ఆకాంక్షించిన విషయం తెలిసిందే. ఇది ఒక ఆసక్తికర చర్చకు దారి తీసింది. అయితే చంద్రబాబు నాయుడుకు ప్రజలు అయితే కూటమి ద్వారా ఇంకో అవకాశం ఇచ్చారు కాబట్టి, ఇంకో నాలుగున్నరేళ్లు ఆయన అధికారికంగా సీఎంగా కొనసాగవచ్చు. ఆ తర్వాత ఎన్నికలు జరగాల్సి ఉంది. జమిలి ఎన్నికల సంగతులను పక్కన పెడితే, 2029 వరకూ చంద్రబాబు నాయుడు సీఎంగా కొనసాగడానికి అవసరమైన మెజారిటీ అయితే టీడీపీ వద్ద ఉంది. ఒకవేళ ఏదైనా కారణం చేత ఈ కూటమి నుంచి పవన్ కల్యాణ్ బయటకు వచ్చినా, చంద్రబాబు నాయుడు సీటుకు అయితే ఎలాంటి ఇబ్బంది లేదు. ఆ మేరకు టీడీపీకి సొంత మెజారిటీ ఉంది. రాజకీయాల్లో ఎవరి వ్యూహాలు ఏ మేరకు ఎప్పుడు మారతాయో వేరే చెప్పనక్కర్లేదు. స్వయంగా చంద్రబాబు- పవన్ కల్యాణ్ ల స్నేహాన్నే ఇందుకు ఉదాహరించినా 2014 ఎన్నికల్లో వీరంతా కూటమిగా వెళ్లారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ పార్టీ పోటీ చేయలేదు, అయితే జనసేన అంటూ పార్టీ పెట్టి అప్పుడు చంద్రబాబు ను సీఎంగా చేయడానికి పవన్ చాలా కష్టపడ్డారు. అయితే అదే పవన్ కల్యాణ్ మనసు 2019 నాటికి మారిపోయింది. ఎర్ర పార్టీలతో జట్టు కట్టారు..ఫలితం కనిపించలేదు. దాంతో ఎరుపు కన్నా కాషాయమే బెటర్ అనుకుని తిరిగి పవన్ కల్యాణ్ కాషాయ కూటమిలో మళ్లీ చేరారు! ాబట్టి.. ఎరుపు, కాషాయం ఇలా ఎప్పుడు ఏ రంగులు అయినా మారిపోవచ్చు. కాబట్టి రాబోయే పదేళ్ల రాజకీయం గురించి పవన్ తన ఆకాంక్షను చెప్పేయడం కాస్త విచిత్రమే. అయితే ఇది పవన్ వీరాభిమానులకు మింగుడు పడదు. పవన్ కల్యణ్ సీఎం కావాలనేది ఆయన వీరాభిమానుల సుదీర్ఘ ఆకాంక్ష. క తెలుగుదేశం చంద్రబాబే సీఎం అభ్యర్థిగా గత ఎన్నికలకు వెళ్లింది. అయితే ఆ పార్టీ యువ కిరణం లోకేష్ సీఎం కావాలని అక్కడా డిమాండ్ ఉంది. ఈ డిమాండు కూడా పాతదే. 2019 ఎన్నికలు పూర్తి కాగానే.. లోకేష్ సీఎం, ప్రధాన మంత్రిగా చంద్రబాబు, రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు ఉంటారంటూ అప్పట్లో నే ప్రచారాలు మొదలుపెట్టారు. 2019 ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందని, కాంగ్రెస్ తో కలిసిన చంద్రబాబు చక్రం తిప్పి సీఎం అవుతారని దీంతో రెండు పదవుల్లో కొనసాగలేరుకాబట్టి.. లోకేష్ సీఎం అవుతారనేది అప్పుడు జరిగిన ప్రచారం. అయితే ఫలితాలు వేరేలా రావడంతో వారి కలలకు భంగం కలిగింది. ఆ సంగతలా ఉంటే.. ఒకవేళ 2029 నాటికి అయినా లోకేష్ ను టీడీపీ సీఎం క్యాండిడేట్ చేయాలనుకుంటే, లేదా అంతలోపే సీఎం సీట్లో లోకేష్ ను కూర్చోబెట్టేసి ఎన్నికలకు వెళ్లాలని చంద్రబాబు భావిస్తే.. అప్పుడు పవన్ పరిస్థితి ఏమిటనేదే ఆసక్తదాయకమైన అంశం. ఇక, టీడీపీకి చంద్రబాబు తరువాత లోకేషే బాస్. పోటీదారు అనుకున్న జూనియర్ ఎన్టీఆర్ ను ఎప్పుడో సైడ్ చేశారు. కాబట్టి నిజంగా లోకేష్ కోరుకుంటే, ఏ ఆటంకం లేకుండా సీఎం అయిపోగలడు. ఒకవేళ తనకు వయసు మీద పడుతోందనో, లేక లోకేష్ ను ఎన్నికలకు ముందే సీఎంగా కూర్చోబెట్టేయాలనో చంద్రబాబు భావించినా ఆశ్చర్యం లేదు. అలాంటి పరిస్థితి ఇంకో రెండు మూడు సంవత్సరాల తర్వాత వచ్చినా అప్పుడు పవన్ కల్యాణ్ సమ్మతించక తప్పుతుందా అనేది ఆసక్తిదాయకమైన అంశం. ఎందుకంటే పోటీ చేసింది కూటమిగానే కానీ, టీడీపీకి సొంత బలం ఉంది. సొంతంగా మెజారిటీకి కావాల్సినంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్టీ గీత దాటని వారే వారిలో ఎక్కువమంది. లోకేష్ సీఎం అంటే.. వారిలో చాలా మంది ఎగిరిగంతేస్తారు. కాబట్టి సీఎం కావాలనేది లోకేష్ కు చిటికెలో పని!

## హరీశ్‌రావును కలిసిన టీటీడీ చైర్మన్


హైదరాబాద్ : మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మీడియా రంగంలో సుదీర్ఘకాలంగా విశేష సేవలు అందించిన నాయుడికి కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి సేవ చేసే భాగ్యం పొందడం అదృష్టమని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తారని హరీష్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలలో స్వామి దర్శనం కోసం వస్తున్నందున, తెలంగాణ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యుల సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా బీఆర్ నాయుడిని హరీష్ రావు కోరారు. తెలంగాణ భక్తులకు దర్శనం, వసతి వంటి సేవలను మెరుగుపరచడానికి ఈ చర్యలు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. టీటీడీ బోర్డులో చర్చించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిద్దిపేటలో కూడా టీటీడీ దేవాలయం నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నందున, నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని హరీష్ రావు కోరారు. సిద్దిపేటతో పాటు కరీంనగర్ లో నిర్మాణంలో ఉన్న టీటీడీ దేవాలయ పనులను పూర్తి చేసేందుకు బోర్డులో చర్చిస్తామని నాయుడు హామీ ఇచ్చారు.

## బాదాలో భారీగా పోలీసుల మోహరింపు

ఆసిఫాబాద్ : ఫుడ్ పాయిజన్‌తో మరణించిన వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ స్వగ్రామం బాదాలో పోలీసులు భారీగా మోహరించారు. శైలజ మృతదేహం ఆసిఫాబాద్ జిల్లా బాదా గ్రామానికి చేరుకున్నది. దీంతో ఆమె బంధువుల, గ్రామస్తులు అంబులెన్స్‌ను చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆమె డెడ్‌బాడీని అందులోని నుంచి దించకుండా అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారందరిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని అడుగడుగునా మోహరించారు. గ్రామంలోకి ఇతరులు ఎవరూ రాకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు. సరైన ధృవ పత్రాలు చూపిన తర్వాతే గ్రామానికి అనుమతిస్తున్నారు. మీడియాపై ఆంక్షలు విధించారు. కాగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న ఎమ్మెల్యే కోవా లక్ష్మిని కూడా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ఎమ్మెల్యే.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తనను ఎందుకు వెళ్లనీయడం లేదని ప్రశ్నించారు.

# ఆ బాధ్యత దైవానిదే

'తమ ఆహారాన్ని మోసుకుంటూ తిరగలేని పశు పక్ష్యాదులు ఎన్నో ఉన్నాయి. అల్లాహ్ వాటికి ఉపాధిని సమకూరుస్తాడు. మీ ఉపాధి ప్రదాత కూడా ఆయనే. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ ఎరిగినవాడూను' అంటుంది ఖురాన్ (29:60). 'భూమ్యాకాశాలలోని నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. తాను కోరిన వారికి ఆయన పుష్కలంగా ఉపాధిని ఇస్తాడు. తాను కోరినవారికి ఆయన ఆచితూచి ఉపాధిని ఇస్తాడు' అని కూడా సెలవిచ్చింది. పక్షులు ఉషోదయాన ఆకలితో తమ గూళ్లను వదిలి, సంధ్యా సమయానికి కడుపు నింపుకొని తిరిగి తమ గూటికి వస్తాయి. వాటన్నింటికీ ఆహారాన్ని అందించేది దైవమే. ఈ సృష్టిలో జీవరాశుల పోషణ బాధ్యత అల్లాహ్‌దే అన్నది ఖురాన్ చెబుతున్నది. భూమిపై లెక్కలేనన్ని జంతువులు ఉన్నాయి, అవి తమ జీవనోపాధిని నిల్వ చేయవు. ఆహార సేకరణ గురించి చింతించవు. భూమిలోపల తలదాచుకుంటున్న కీటకాలు, చీమలు మొదలుకుని, ఆకాశంలో ఎగిరే పక్షులు, నీటిలో నివసించే చేపలు, ఇతరత్రా జీవరాశులన్నిటికీ ఆ దైవమే ఆహారాన్ని సమకూరుస్తున్నాడు. అసంఖ్యాకమైన పక్షులు, పశువులు వీటిలో ఏదీ తన ఉపాధిని తానే మోసుకుంటూ తిరుగదు. అవి ఎక్కడికి వెళ్లినా దైవానుగ్రహం వల్ల వాటికి ఏదో ఒక విధంగా ఉపాధి లభిస్తూనే ఉంటుంది. ఒక్కొక్క పిట్ట గూడును, ఒక్కొక్క పురుగు బిలాన్నీ అల్లాహ్ ఎరుగును. ఏ ప్రాణి ఎక్కడ ఉందో దైవానికి బాగా తెలుసును. అందుకే 'మీరు ఉఫాధి గురించి యోచించి ధైర్యం సడలి కూర్చోకండ'ని మానవజాతికి సూచిస్తున్నాడు అల్లాహ్. పక్షుల మాదిరిగానే మానవులు కూడా ఉపాధి కోసం అన్వేషిస్తే తప్పకుండా అల్లాహ్ అనుగ్రహం లభిస్తుంది. చీమలు, కీటకాల ఆహారాన్ని అందించడానికి ఇంత శ్రద్ధ వహించినప్పుడు, దయ స్వరూపాన్ని, కారుణ్యాన్ని మనిషి అర్థం చేసుకోలేక పోతున్నాడు. ఇలా అడ్డదారుల్లో ప్రయాణించిన వాళ్లు అంతిమ దినాన చింతించాల్సిన పరిస్థితి ఏర్ప డుతుంది. దైవాన్ని విశ్వసించి, సన్మార్గంలో నడిచిన వారిపై అల్లాహ్ దయ సదా ఉంటుంది.



ఆధ్యాత్మికం

# ప్రజా సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

## • సంక్షేమ పథకాల్లో ఎలాంటి రాజకీయాలు ఉండవు
## • ఆరు గ్యారెంటీల అమలే లక్ష్యం: మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి

**కూకట్‌పల్లి నవంబర్ 26 (ది క్రైమ్ న్యూస్):** ప్రజా ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తుందని మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో మూడు కోట్ల 54 లక్షల రూపాయల విలువైన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పోరేటర్ లు జూపల్లి కృష్ణారావు, మందడి శ్రీనివాస రావు, శిరీషా బాబూరావు లతో కలిసి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని అన్నారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం పై ప్రజలు ఆశతో ఉంటారని, ప్రజల ఆశలను వమ్ము చేయకుండా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఎలాంటి పక్షపాత ధోరణి ఉండదని అలా ఎవరైనా భావిస్తే అది వారి భ్రమే అవుతుందన్నారు. నిరంతరం ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో సైతం ప్రజల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.



కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి బి.బ్లాక్ అధ్యక్షుడు తుమ్మూ వేణు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవరావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కృష్ణ రాజ్ పుత్, సతీష్ గౌడ్, మహమ్మద్, మేకల రమేష్, మధు గౌడ్, లక్ష్మినారాయణ, మస్తాన్ రెడ్డి, కనకయ్య ముదిరాజ్, అక్బర్, శివ చౌదరి, నలిని కాంత్, భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్నకార్పొరేట్,
# మతోన్మాద అనుకూల విధానాలు విడనాడాలి

**పెద్దపల్లి నవంబర్ 26 ( ది క్రైమ్ న్యూస్ ):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసన లో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావ్ లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం 3వ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులను కాలరాస్తున్నదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యవసాయాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పజెప్పే నిర్ణయాలు చేస్తుందని, వ్యవసాయ కూలీలకు కనీస వేతనం అమలు చేయడం లేదని, గత బడ్జెట్లో పన్నుల విధానంలో తెచ్చిన మార్పుల మూలంగా నిత్యవసర సరుకుల, వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, విద్య, వైద్యం సామాన్యులకు అందకుండా పోయిందని, నిరుద్యోగం తీవ్రతరం అవుతుందని, ప్రభుత్వ రంగ సంస్థలని ప్రైవేటు చేయడం మూలంగా ఉపాధి తగ్గి,రిజర్వేషన్లు ఎగిరిపోతున్నాయని, సామాజిక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని అన్నారు. ఈ



సమస్యలన్నింటికీ మూలమైన కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్పోరేట్, మతోన్మాద అనుకూల విధానాలు మార్చుకోవాలని, లేకుంటే దేశంలోనే కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు పేద సామాన్య మధ్యతరగతి ప్రజలందరినీ సమీకరించి బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి. సీఐటీయూ నాయకులు కడారి తిరుపతి పోషం వైనాల రవి నరేష్ రైతు సంఘం సహాయ కార్యదర్శి ఎల్, భీమన్న, నాయకులు బొంకూరి సాగర్, కుక్క అన్వేష్, చింతల మరియా, దొడ్డి బాబు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగం ద్వారానే దేశ పౌరులకు స్వేచ్ఛ, సమానత్వం లభించింది

### - సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




**కరీంనగర్ టౌన్, నవంబర్26(ది క్రైమ్ న్యూస్):** రాజ్యాంగం ద్వారానే దేశ పౌరులకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లభించిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహానికి పూల వేసి మాట్లాడారు.రాజ్యాంగాన్నిఆమోదించి నేటికి 75వసంతాలు పూర్తయిన సందర్భంగా జిల్లావాసులకు భారత రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మార్గనిర్దేశనంలో అందించిన రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ అందాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. 1949 నవంబర్ 26 న రాజ్యాంగాన్ని ఆమోదిస్తూ తీసుకున్న నిర్ణయంతో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా పరిఢవిల్లుతోందని చెప్పారు. దేశాన్ని సమున్నతంగా నిలబెట్టిన రాజ్యాంగ నిర్మాతలను సంవిధాన్ దివస్ రోజున స్మరించుకోవడమే కాకుండా రాజ్యాంగ విలువలు కాపాడుతూఆమహాశయులఆశయసాధనకోసంప్రతిఒక్కరూనిరంతరంపనిచేయాలనిఆకాంక్షించారు. ప్రతినిత్యం మన హక్కులు, బాధ్యతలను గుర్తుచేస్తూ అందరికీ సమానావకాశాలతో ప్రగతిపథంలో బాటలు వేయడానికి నిత్యస్ఫూర్తిగా నిలిచే మూలస్తంభం మన రాజ్యాంగమని పేర్కొన్నారు.

## రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ అధిక ప్రాధాన్యతనిచ్చింది

### - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం రాఘవపూర్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం ద్వారా 20లక్షల నిధులతో గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తవుతున్న తరుణంలో ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కొవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదెలు యాదవ్,వైస్ చైర్మన్ రామిడి తిరుమల్, మాజీ ఎంపీపీ ముద్దసాని సులోచన-శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, గసికంటి సంపత్, వంగల మల్లేశం, మీస సత్యనారాయణ, కోండ్ర సురేష్, కనుకం అశోక్, కొత్తకొండ శంకర్, ఇర్ఫాన్, రామిడి తిరుపతి, బందెల మహేందర్, చలిగంటి సంపత్,కనుకంకుమార్,రామగిరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ కమీషనరేట్‌లో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం





**కరీంనగర్ టౌన్, నవంబర్26(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవ సందర్బంగా అడిషనల్ డీసీపీ ఏ ఆర్ అనోక్ జయకుమార్, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు సిబ్బంది అంతా రాజ్యాంగ ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్బంగా అడిషనల్ డీసీపీ రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ జానీమియా, శ్రీధర్ రెడ్డి ఇతర అధికారులు మినిస్టీరియల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాలెట్ ఓటింగ్ కావాలని వేసిన పిల్‌ను కొట్టివేసిన సుప్రీం కోర్టు

### - జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, నవంబర్ -26: (ది క్రైమ్ న్యూస్ ):** భారతదేశ చట్ట సభలకు జరిగే ఎన్నికలలో ఈవీఎంలను రద్దుచేసి బ్యాలెట్ ఓటింగ్ ప్రవేశపెట్టాలని సుప్రీంకోర్టులో వేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ (పిల్) ను కొట్టి వేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు విక్రమ్ నాథ్ , పి.బి.వరాలే తీర్పు ఇచ్చారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ బ్యాలెట్ ఓటింగ్ కావాలని సుప్రీంకోర్టులో మత ప్రచారకుడు డాక్టర్ కె.ఎ పాల్ వేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ ను విచారించిన న్యాయస్థానం, ఎన్నికలలో ఓటమి చెందిన వారు తప్పు పట్టడం మంచిది కాదని, ఎన్నికలలో గెలిచినప్పుడు ఉండని ఫిర్యాదులు, ఓడిపోతే మాత్రం ఈవిఎం లను ప్రశ్నించడం మంచిది కాదని తెలిపిందని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

## ఇంట్లో సిలిండర్ పేలి అగ్ని ప్రమాదానికి గురైన ఏఎస్సై చికిత్స పొందుతూ మృతి

**కరీంనగర్ టౌన్, నవంబర్26(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్‌లోని సీసీఆర్బి విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై టి. రామస్వామి ఈ నెల 17వ తేదీ ప్రమాదవశాత్తు ఇంట్లో సిలిండర్ పేలి అగ్ని ప్రమాదానికిగురయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. దురదృష్ఠవశాత్తు తొమ్మిది రోజుల అనంతరం చికిత్స పొందుతూ ఉదయం ఆయన మృతి చెందారు.



## మేడిపల్లి శివారులో ప్రభుత్వ భూముల సర్వే



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 26:** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధి మేడిపల్లి శివారులో మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. రామగిరి ఖిల్లా ప్రాంతంలో 39.38 ఎకరాల ప్రభుత్వ భూమి తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు ఇవ్వాలనే ప్రతిపాదనల మేరకు సర్వే నిర్వహించారు. రెవెన్యూ, అటవీ శాఖ, ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అధికారులు ఈ ప్రాంతంలో భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రామగిరి తహసిల్దార్ బోర్కారి రామచంద్రరావు, ఇండస్ట్రియల్ మేనేజర్, జిల్లా సర్వేయర్ గణపతి, ఆర్.ఐ కే. మహేష్ బాబు, పోనగంటి సంపత్, మండల సర్వేయర్ నాగండ్ల. రాధిక, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పసరగొండ.రంజిత,సెక్రటరీ గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ సమర్పణ దివస్ కార్యక్రమం

## పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వర్ రావు



**కూకట్‌పల్లి నవంబర్ 26 (ది క్రైమ్ న్యూస్):** 75'వ రాజ్యాంగ సమర్పణ దివస్ వేడుకలు కూకట్‌పల్లి లోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కూకట్ పల్లీ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు అధ్యక్షతన నిర్వహించిన 75'వ రాజ్యాంగ సమర్పణ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ చరిత్రలో నవంబర్ 26 అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజు అని. మరీ ముఖ్యంగా ఆధునిక, లౌకిక, ప్రజాస్వామ్య, భారతదేశ నిర్మాణంలో ఈ రోజుకు చాలా ప్రాధాన్యత ఉందని, 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు అంటే సామ్రాజ్యవాదుల పాలన అంతమై, అధికారం భారత పాలక వర్గాల చేతుల్లోకి వచ్చిందని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ సభలో ముసాయిదాని ప్రవేశపెడుతూ "రాజ్యాంగం ఎంత ఉన్నతమైనదైనా దాన్ని అమలు చేసేవారు ఉన్నతులు కాకపోతే అది ఒక చెడ్డ రాజ్యాంగంగానే నిరూపించబడుతుంది" అని హెచ్చరిక చేశారని, భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ప్రధాని నరేంద్ర మోడి రాజ్యాంగం లోని విలువలలో కాపాడుతూ రాజ్యాంగ ఫలాలను ఈ దేశంలోని ప్రతి పౌరునికి అందే విధంగా కృషి చేస్తూ, రాజ్యాంగానికి అనుగుణంగా ఈ దేశ ప్రతిష్టను, కీర్తిని ప్రపంచ దేశాల్లో చాటుతుంటే కొందరు మాత్రం వారి వారి పబ్బం గడుపుకోవడానికి నరేంద్ర మోడీ మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని, ఎంత ప్రచారం చేసిన ప్రజలు వారిని నమ్మలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్ రావు, హర్షనపల్లి సూర్యారావు, మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి నియోజకవర్గంలోని డివిజన్ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**ధర్మపురి నవంబర్ 26, (ది క్రైమ్ న్యూస్):** భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ధర్మపురి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి నేటికీ 75 సంవత్సరాలు పూర్తయిన సంధర్భంగా ధర్మపురి పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందిస్తూ రూపొందిం చబడిన మన భారత రాజ్యాంగాన్ని 1949, నవంబర్ 26న ఆమోదించబడిన సందర్భంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. భారత దేశంలో ఉన్న అన్ని వర్గాల వారికి న్యాయం చేకూర్చే విధంగా రాజ్యాంగాన్ని అంబేద్కర్ రూపొందించడం జరిగిందనీ, వారి బాటలో నడుస్తూ వారి ఆశయాలను నెరవేర్చడమే అంబేద్కర్ కి ఇచ్చే ఘనమైన నివాళి అని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాకు న్యాయం చేయండి




**జమ్మికుంట నవంబర్ 26 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని కొత్త పెల్లికి చెందిన కాటిపల్లి లక్ష్మి, తన కుమారుడు కాటిపల్లి ఫస్ట్ రాజు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ మా సర్వే నెంబర 465/బి/4 ధర్మారం శివారులో 0-06 గుర్రాలు భూమి మా తల్లిదండ్రులు 2004 సం?లో కొనుగోలు చేసినారు. అప్పటి నుండి నేటి వరకు మా ఆధీనములోనే ఉన్నది. కానీ 6 నెలల క్రితం నుంచి అట్టి భూమితో ఎలాంటి సంబంధం లేని ఏనుగు జయపాల్ రెడ్డి అనే వ్యక్తి, తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి స్థానికంగా ఉండే కొంతమంది వ్యక్తులతో కలిసి నాకు ఉ న్న 0-06 గుఎంల భూమిని కబ్జా చేయాలనే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై నేను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడముతో ఏనుగు జయపాల్ రెడ్డి, తనకు ఉన్న ఆర్థికబలం, అంగబలంతో స్థానిక అధికారులను మచ్చిక చేసుకొని నా కుమారుడు అయిన కాటిపెల్లి రాజుపై స్థానిక డిప్యూటి తహశీల్దార్ సంతకం ఫోర్జరీ చేసినాడని జమ్మికంట తహశీల్దార్, నా కుమారుడిపై తప్పుడు కేసు నమోదు చేయించినారు. నాకు జరిగిన ఈ అన్యాయముపై నేను జిల్లా కలెక్టర్, సిపి లకు ఫిర్యాదు చేసినాను. తక్షణమే స్పందించిన కల్టెకర్ నా పట్టా భూమిపై పూర్తి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హుజురాబాద్, ఆర్డీవొ కు ఆదేశించినారు. సిపి నాపై నమోదు అయిన తప్పుడు కేసులపై నివేదిక ఎసిపి ను ఆదేశించినారు. అయినప్పటికి క్రింది స్థాయి అధికారుల నుండి సరియైన స్పందన లేకపోవడముతో నేను 8 సార్లు జిల్లా కలెక్టర్ ను, కలిసి న్యాయం చేయాలని, నేను కోరగా 8 సార్లు హుజురాబాద్ ఆర్డీవొ ను జరిగిన పై సమస్యపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినారు. కానీ ఆర్డీవో నిర్లక్షంగా వ్యవహరించడం వలన సమస్యను తప్పుదొవ పట్టిస్తున్నారు అని వారు ఆరోపించారు.జిల్లా కలెక్టర్ నాపై పెట్టిన తప్పుడు కేసుల గురించి సిపి, కరీంనగర్ ని 4గుసార్లు కొరినప్పటికి క్రింది స్థాయి సిబ్బంది విషయాన్ని సిపి దృష్టికి తీసుకవెళ్ళడం లేదు. ఒక సామన్య వ్యక్తినైన నేను నాకు జరిగిన అన్యాయముపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి క్రింది స్థాయి సిబ్బంది ఎనుగు జయపాల్ రెడ్డి ప్రలోబాలకు తలొగ్గి మా సమస్యను కాలయాపాన చేస్తున్నారు అని ఆరోపించారు. దేవుడు వరమించిన పూజారి కనుకరించలేన్నట్టు ఉంది తమ పరిస్థితి ఉన్నదని, తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# పోగొట్టుకున్న చరవాణిని బాధితునికి అప్పగించిన ఎస్సై తాండ్ర వివేక్




**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన కొంపెల్లి సతీష్ అనే జర్నలిస్ట్ కొద్ది రోజుల క్రితం వృత్తిలో భాగంగా ఎల్ఎండి లోని ఎమ్మెల్యే క్యాంపు పరిసర ప్రాంతంలో పని ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్లే క్రమంలో తన చరవాణి ఎక్కడో అదృశ్యమవ్వగా ఎంత వెతికిన ఆచూకీ లభించకపోవడంతో వెంటనే ఎల్ఎండి పోలీస్ స్టేషన్ లోని ఎస్ఐ వివేక్ ను కలిసి ఫిర్యాదు చేసి సిఈఐఆర్ పోర్టల్ లో వివరాలు పొందు పరుస్తూ దరఖాస్తు చేయగా చరవాణి లభ్యం కావడంతో మంగళవారం బాధితుడు సతీష్ కు ఎల్ఎండి ఎస్సై తాంద్ర వివేక్ చరవాణిని అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సతీష్ ఎస్సై వివేక్, కానిస్టేబుల్ పాషా, తెలంగాణ పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

# మద్యం సేవించి వాహనాలు నడపరాదు

### - డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన ఇద్దరికీ మూడు రోజులు పెద్దపల్లి జిల్లా కోర్టులో క్లీనింగ్ పనులు చేయాలని శిక్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మద్యం సేవించి వాహనాలు నడిపిన మందుబాబులకు పెద్దపల్లి న్యాయమూర్తి ఎన్.మంజుల గారు తీర్పు నిచ్చారు. శుక్రవారం వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడ్డ మొత్తం 13 మందిని పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులు స్థానిక కోర్టులో హాజరు పరిచారు. వారిని విచారించిన న్యాయమూర్తి శ్రీ మంజుల గారు 13 మందికి 14,500/- రూపాయల జరిమానా విధించారు. అయితే అత్యధికంగా మద్యం సేవించి వాహనం నడిపిన సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన మామిడి రమేష్ కు మరియు పెద్దపల్లి కి చెందిన పంకజ్ అను వ్యక్తులకు రూ.500/- రూపాయల జరిమానా తో పాటు సామాజిక సేవలో భాగంగా మూడు రోజులపాటు జిల్లా కోర్ట్ పెద్దపల్లి లో క్లీనింగ్ పనులు చేయాలని తీర్పునిచ్చారు. బుధ, గురు మరియు శుక్ర వారాల్లో క్లీనింగ్ పనుల్లో ఉపయోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

# ప్రజాస్వామ్యానికి హక్కులే పునాదులు

### - హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాలి
### - రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు






**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 26:-** భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జి.యం. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ముందుగా ఉద్యోగులందరూ రాజ్యాంగ ప్రవేశికను చదివారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం అందిస్తూ రూపొందించబడిన మన భారత రాజ్యాంగం 1949, నవంబర్26 న ఆమోదించబడిన సందర్భంగా 2015 నుండి ప్రతి సంవత్సరం భారత రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. 1950, జనవరి 26 నుండి రాజ్యాంగాన్ని అమలులోకి తీసుకువచ్చారన్నారు. ప్రజలే పాలకులుగా రూపు దిద్దుకున్న మన భారత దేశానికి ఒక దశ, దిశ కల్పించడం కోసం రాజ్యాంగ రూపకల్పన చేశారన్నారు. భారత రాజ్యాంగ ప్రతిని రూపొందించిన కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరించి, రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ని మనం మరిచిపోలేమన్నారు. వారు దేశంలోని భిన్న నాగరికతలు, భిన్న మతాలు, కులాలు, ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ రాజ్యాంగ రూపకల్పన చేశారన్నారు. ప్రతీ ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని గ్రహించి, హక్కుల కోసమే కాకుండా, బాధ్యతలను కూడా తెలుసుకొని జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి జి.శ్రీనివాసరావు, ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖరబాబు, విభాగాధితులు కె.చంద్రశేఖర్, పి.రాజారెడ్డి, బి.సుదర్శనం, కె.ఐలయ్య, బి.వి.సత్యనారాయణ, ఆర్.రాజేశ్వరి, అధికారులు కోల శ్రీనివాస్, గుర్రం శ్రీహరి, సునీల్ ప్రసాద్, రాజేశం, మతిన్ హుస్సేన్, విక్రమ్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు






**జమ్మికుంట నవంబర్ 26 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం రాజనీతి శాస్త్రం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్ అధ్యక్షతన ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన హుజురాబాద్ బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యాక్షులు మొలుగూరి సదయ్య మాట్లాడుతూ విద్యార్థులు భారత రాజ్యాంగాన్ని చదవాలని, రాజ్యంగాపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అతి పెద్ద లిఖిత రాజ్యాంగం అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించాలనీ, దేశ గౌరవాన్ని పెంపొందించాలని సూచించారు రాజ్యాంగ ఏర్పాటుకు అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంతో రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ ఎం. మాధవి, డా కె.రాజేంద్రం, డా కె. గణేష్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా రవి, ఎల్.రవిందర్, పి శ్రీనివాస్ రెడ్డి, ఉమాకిరణ్, కిరణ్ కుమార్, మమత, రమేష్, రవి ప్రకాశ్, సుష్మ, ప్రశాంత్, అను రాజ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తితో కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదాం



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 26:** మంథని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారానికి వచ్చిన బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కార్మిక రైతు వ్యవసాయ కార్మిక ప్రజావ్యతిరేక పాల్పడుతున్నదని కార్పొరేట్ల ప్రయోజనం కోసం దేశ స్వాతంత్రాన్ని స్వాలంబనను తాకట్టు పెడుతుందని స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు ఊడిగం చేస్తుందని విమర్శించారు రాజ్యాంగం అమల్లోకి వచ్చి 71 సంవత్సరాలు గడుస్తున్న దేశంలో పేదరికం పోలేదని అన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తితో రైతు కార్మిక వ్యవసాయ కూలీల హక్కుల కోసం ఉద్యమిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, గర్ల్స్ కన్వీనర్ స్వప్న, కేవీపీఎస్ నాయకుడు మంథని లింగయ్య, ఇరుగురాళ్ల ప్రసాద్, కడారి సంజయ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తాం

## - ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మపురి నవంబర్ 26, (ది క్రైమ్ న్యూస్):** అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా తెలంగాణ ప్రభుత్వము పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ధర్మపురి మండలం దొంతపూర్ గ్రామంలో 12 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి మరియు గాదేపెల్లి గ్రామంలో 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన పంచాయితీ కార్యలయ భవన నిర్మాణానికి మంగళవారం రోజున ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం అంగన్వాడీల ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్న పిల్లల అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రాంట్ కింద మజూరు కాబడిన దొంతాపూర్ గ్రామ నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి మరియు గాదెపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందని లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం పూర్తి చేసుకోనున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ధర్మపురి మండలానికి చెందిన దొంతపూర్ మరియు గాదెపల్లె గ్రామాలకు చెందిన ప్రతి సమస్యను పరిష్కరిస్తమని, ఈ ప్రాంతానికి సంబంధించిన లిఫ్ట్ ల నిర్వహణ గురించి అధికారులతో మాట్లాడటం జరిగిందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ విషయంలో కూడా గ్రామ సభ నిర్వహించి అర్హులైన పేదవారికి ఇండ్లను పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులతో ఓటుపై అవగాహన కార్యక్రమం

## చేపట్టిన ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు...



**కరీంనగర్ టౌన్, నవంబర్26(ది క్రైమ్ న్యూస్):** మార్నింగ్ వాకింగ్ లో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఐటిఐ కాలేజీ మైదానంలో వాకింగ్ చేస్తూ పట్టభద్రుల సమస్యలను అడిగి తెలుసుకున్న పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు. అనంతరం వివిధ గ్రామాల పర్యటించి అక్కడున్న పట్టభద్రులతో సమావేశమయ్యి ఓటు పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. పెద్దపెల్లి జిల్లా కేంద్రం ప్రకటించినప్పటి నుండి ఇప్పటివరకు ఎటువంటి డెవలప్మెంట్ అనేది లేదు అని పేర్కొన్నారు. పెద్దపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటుచేసి పెద్దపల్లి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మిషన్ భగీరథ పైప్ లైన్స్ సరిగ్గా లేక త్రాగునీరుకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని తెలిపరు. జిల్లా హెడ్ క్వార్టర్ అయినా చిల్డ్రన్స్ పార్క్ లేదని తెలపారు. సరియైన డ్రైనేజ్ సిస్టమ్స్ లేక నీరు నిలిచి చాలాదుర్గంధం వాసన వస్తుందని దాని ద్వారా దోమలు ఎక్కువై అనారోగ్యనికి గురవుతున్నామని చెప్పుకొచ్చారు. పెద్దపెల్లి జిల్లా కేంద్రమైనను ఇక్కడ మహిళలకు ప్రత్యేక మహిళ డిగ్రీ కళాశాల లేదు అని మహిళ కళాశాల కొరకు కృషి చేయలని, సింగరేణి ప్రాతం కాబట్టి మైనింగ్ సంబంధించిన యూనివర్సిటీ కొరకు కృషి చేయలని, జిల్లా కేంద్రమైన ను సరియైన కోచింగ్ సెంటర్లు లేక ఇక్కడున్న నిరుద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్మీ నేవీ మరియు పోలీస్ కి సంబంధించిన ఎంతో మంది గ్రౌండ్ ప్రిపేర్ అయ్యి ఈవెంట్స్ మెరిట్ లో కొట్టినప్పటికీ సరియైన కోచింగ్ లేక రిటర్న్ ఎగ్జామ్ లో ఫెయిలవుతున్నారని మా దృష్టికి తీసుకువచ్చారు. సరియైన మెటీరియల్ కూడా కావాలని మెటీరియల్ లేక దూర ప్రాంతాలకు కోచింగ్ తీసుకోలేక మలో మేమే మనోవేదనకు గురవుతున్నామని, దీనికి సానుకూలంగా స్పందించి ఫ్రీ స్టడీ మెటీరియల్ కోచింగ్ ఇప్పిస్తానని తెలిపారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి ప్రత్యేకమైన ఒక యాప్ ను ఈ యాప్ లో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి అన్ని రకాల మెటీరియల్ పొందుపరుస్తామని




తెలిపారు ఇది పూర్తిగా ఉచితంగా అందిస్తామని, పట్టబద్రుల కోసం ప్రత్యేకమైన స్టడీ హాల్స్ ను ఏర్పాటుచేసి మెటీరియల్ కూడా అందిస్తామని హామీ ఇచ్చిన పట్టపద్రుల ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి ట్రస్మా ప్రెసిడెంట్ శ్రీధర్, ట్రస్మా డిస్ట్రిక్ ప్రెసిడెంట్ ఏ.కేశవరెడ్డి, ట్రస్మా స్టేట్ అడ్వైసర్ ఆర్ వి రమణారావు, ట్రస్మా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఏ. శ్రీనివాస్,ఆనంతుల శ్రీనివాస్ జాజిరెడ్డి, ఆయస్, హామీనొద్దీన్, శోభరాణి, ఫజల్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినిల తల్లిదండ్రులకు తహసీల్దార్ బి. రాజేశ్వరి కౌన్సిలింగ్



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న రాజీవ్ నగర్ కాలనీకి చెందిన విద్యార్థినిలు గత కొంతకాలంగా పాఠశాలకు హాజరు కాకపోవడంతో గత శనివారం స్థానిక తహసిల్దార్ బి. రాజేశ్వరి, ఎంఈఓ. ఎం మధుసూదనాచారి విద్యార్థినిల తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి,పిల్లలకు చదువు యొక్క ప్రాముఖ్యత తల్లిదండ్రులకు తెలియజేశారు. ఉన్నతాధికారుల చొరతో విద్యార్థినుల తల్లిదండ్రులు విద్యార్థినిలను మంగళవారం నుండి పాఠశాలకు పంపించినట్లు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, తాసిల్దార్ బి.రాజేశ్వరికి, ఎంఈఓ మధుసూదనాచారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఆర్బీఐ గవర్నర్



**(ది క్రైమ్ న్యూస్):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆర్బీఐ అధికార ప్రతినిధి ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పారు. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం ఉదయం స్వల్ప అస్వస్థతకు గురికావడంతో చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేరారు. చికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు ప్రకటించారు. కొన్ని గంటల పరిశీలన అనంతరం సాయంత్రం ఆయనను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

# అధిక దిగుబడులపై రైతులకు అవగాహన



**జమ్మికుంట నవంబర్ 26 (ది క్రైమ్ న్యూస్):** పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించమే లక్ష్యంగా మంగళవారం రోజున మల్లారెడ్డి విశ్వవిద్యాలయం (వ్యవసాయ విద్యార్థులు)3 నెలల రూరల్ అవేర్నెస్ వర్క్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులని (ఐపీఎం) అనుసరిండం ద్వారా పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ఎక్కువ దిగుబడి పెంపు పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంట మార్పిడి, లోతుగా దున్నడం, అంతర పంటలు, ట్రాప్ పంట, లింగాకర్మక బుట్టలు, జిగురు ఆకర్షక అట్టలు (పసుపు రంగు, జిగురు అట్ట, నీలిరంగు, జిగురు అట్ట), పాన్ ట్రాప్స్ పండు, ఈగ ఫెరోమోన్ ట్రాప్స్, దీపపు ఎరలు, విషపు ఎరలు, వంటి పర్యావరణ పద్ధతుల గురంచి రైతులకు అవగాహన కల్పించారు. ఇంటరాక్టివ్ చర్చలు, దృశ్య సహాయాలతో రైతులను ప్రోత్సహిస్తూ ఆచరణాత్మకంగా ప్రదర్శించడం ద్వారా ట్రాప్‌లను ఎలా పొలంలో పెట్టాలో వాటి ప్రాముఖ్యత ప్రయోజనాలను వివరించారు. రైతులు రసాయన మందుల వినియోగాన్ని తగ్గించి ఈ పద్ధతులను అవలంబించడం ద్వారా రైతులు తమ సాగు ఖర్చును తగ్గించి, దిగుబడిని పెంచుకోవచ్చు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) అశోక్, కౌన్సిలర్లు దయ్యాల శ్రీనివాస్, బోగం సుగుణ ఎగిత రవీందర్, ఎగిత మహేందర్, కొమురయ్య సమ్మయ్య, బిక్షపతి, దిటి ధర్మేందర్, బత్తుల వెంకటమ్మతో పాటు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## పంచాయతీకి భూదానం చేసిన నరసింహారెడ్డికి

# ఎమ్మెల్యే కవ్వంపల్లి అభినందనలు



**గన్నేరువరం (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లిలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, చొక్కారావుపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూత్రశాలలు, ప్రహరీగోడ నిర్మాణానికి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ.... గుండ్లపల్లి గ్రామపంచాయతీ భవనానికి రైతు వంగల నర్సింహారెడ్డి తన రెండు గుంటల భూమిని విరాళంగా ఇచ్చి ఉదారతను చాటుకున్నారని,గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములైనప్పుడే పల్లెలు ప్రగతికి పరుగులు పెడుతాయని నరసింహారెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ఏడాదిపాలన పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా నియోజవర్గంలోని అన్ని మండలాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమాల్లో మండల తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో శ్రీనివాస్, మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు కొమ్మెర రవీందర్ రెడ్డి, అనిల్, శ్రీధర్ రెడ్డి, కాల్వ కొమురయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభ్యున్నతికే రాజ్యాంగం దోహదపడుతుంది

- పట్టణంలో, పల్లెల్లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు
- రాజ్యాంగ రక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి
- రాజ్యాంగం వల్లే సమసమాజం నిర్మాణం





**లక్షెట్టిపేట, నవంబర్ 26 (ది క్రైమ్ న్యూస్):** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో, మండలంలోని పాత కొమ్ముగూడెం, హనుమంతపల్లి లో రాజ్యాంగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని వర్గాల అభ్యున్నతికే రాజ్యాంగం పని చేస్తుందని, రాజ్యాంగం రక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాలని, రాజ్యాంగం ద్వారానే సమసమాజం నిర్మాణం సాధ్యమౌతుందని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అన్నారు. రాజ్యాంగం ఆమోదం పొందిన రోజును పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదం పొందడంతో అందరికీ సమాన హక్కులు అందాయన్నారు. అంతకుముందు పట్టణంలో అంబేద్కర్ విజ్ఞాన మందిరం నుండి డీజే తో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దమ్మ నారాయణ, చిప్పకుర్తి నారాయణ,తోగరి కాంతన్న, దొంత నరసయ్య,రాజు, రమేష్, పెండెం సత్తయ్య, పెరుగు తిరుపతి, మినుముల జనార్ధన్, పెండం రాజు, మినుముల వేణు, ఆకనపల్లి శిల్పత్తి, శ్రీనివాస్, నరేష్, సత్తయ్య, రవీందర్, సుధాకర్, కుమార్, నవీన్, మండల నాయకులు, పాత కొమ్ముగూడెం అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సభ్యులు, అంబేద్కర్ అభిమానులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# కేజీబీవీని సందర్శించిన జిల్లా విద్యాశాఖాధికారి



**ముత్తారం.నవంబర్.26.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం రోజున డిఇఓ మాధవి సందర్శించారు.భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డిఇఓ మాధవి పాల్గొని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.విద్యార్థినీలతో ప్రతిజ్ఞ చేయించారు.రానున్న వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థినీలకు పలు సూచనలు,సలహాలు ఇచ్చారు.అనంతరం మధ్యాహ్న సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.వంట గదిలో పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో జరుగుతున్న డ్రైనేజీ మరమ్మత్తు పనులను పరిశీలించారు.సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థినిలు కష్టపడి చదుకొని,అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి జి. స్వప్న, సోషల్ సిఆర్ మనోలత,ఉపాధ్యాయులు,సిబ్బంది ఉన్నారు.

# కాంగ్రెస్ పాలనతోనే పల్లెల అభివృద్ధి సాధ్యం

## • ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతీరావు పూలే ఆదర్శ పాఠశాల లో గ్రామీణ రహదారుల నిర్మాణ నిధులు ద్వారా 60 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు, మహాత్మానగర్ గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.22 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు.అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ..... ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామాల్లో పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం, రవాణా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు వీలుగా రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, దీని వల్ల పల్లెల రూపురేఖలు మారి అభివృద్ధి చెందడమే కాక వలసల నివారణ జరుగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు.కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ చంద్రశేఖర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ మంజులాభార్గవి, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో సురేందర్, పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సరిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంట రాజేందర్ రెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, పోలు రాము, నగునూరు శ్రీనివాస్, గవ్వల రాజేందర్ రెడ్డి, గవ్వల రవీందర్ రెడ్డి, గూడ కమలాకర్, దుర్గా ప్రసాద్, మధుకర్ రెడ్డి, సమద్, పోలు రమేశ్, ఆసిక్ పాషా, మాచర్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని మారుస్తామని దుష్టశక్తులు చేస్తున్న పన్నాగాన్ని తిప్పికొట్టాలి

## - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**తిమ్మాపూర్ (ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూర్ చౌరస్తాలో దళిత సంఘాల ఆద్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ.. విద్యలేని వాళ్ళను, రాజ్యాంగం అంటే తెలియని వాళ్ళను, అన్నిరకాల అనగారిన వర్గాల వారిని కాపాడేది రాజ్యాంగమేనని అటువంటి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ రాజ్యాంగాన్ని మారుస్తామని కొంతమంది దుష్టశక్తులు చేస్తున్న పన్నాగాన్ని తిప్పి కొట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాల్సిందిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోరపెల్లి రమణారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్, నాయకులు గోపు మల్లారెడ్డి ,సముద్రాల లక్ష్మణ్ , కాల్వ మల్లేశం, నేరెళ్ల జంపయ్య, కొమురయ్య, లక్ష్మణ్, ఉప్పులేటి రాజు, చిరంజీవి, ఆసిక్ పాషా, బోయిన కృష్ణబాబు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన విజయోత్సవాల్లో ఉపాధి హామీ పనుల జాతర ప్రారంభం

## - రామగిరి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శైలజా రాణి



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 26:-** ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రామగిరి మండలంలోని 17 గ్రామాలలో ఉపాధి హామీ పనుల జాతర ప్రారంభం చేయడం జరిగిందని రామగిరి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శైలజా రాణి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనుల జాతర నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబరు 1 నుంచి 9వరకు జరిగే ప్రజాపాలన విజయోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా రామగిరి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శైలజా రాణి మాట్లాడుతూ ఉపాధి హామీ జాతరను నిర్వహించి ఇందులో చేపట్టిన పనులను వచ్చే మార్చి 31లోగా పూర్తి చేయనున్నారు. ఇందిరా మహిళా శక్తి, ఉపాధి భరోసా, పొలంబాట, వన మహోత్సవం, జలనిధి, రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పథకాల కింద ఆయా గ్రామాల్లో అవసరమైన పనులు ఈ జాతరలో భాగంగా చేపడతారు. ఇందుకోసం మండలాలవారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి ఆయా మండలాలకు అవసరమైన నిధులను కేటాయిస్తూ అవసరాన్ని బట్టి ఈ అన్ని పనులనుగాని, కొన్ని పనులను గానీ చేపట్టి నిధులు మంజూరు చేస్తారు. ఉపాధి హామీ పనుల లో భాగంగా ఈ సంవత్సరం ఉపాధి హామీ పనులలో భాగంగా ఎక్కువ పని దినాలు పూర్తిచేసిన వారికి, మొక్కలకు నీరు పోసే వారికి ఎంపీడబ్ల్యూఏస్ గ్రామపంచాయతీ సిబ్బందికి అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో సన్మానం చేయడం జరిగింది. అలాగే భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రామగిరి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శైలజా రాణి,మండల పంచాయతీ అధికారి ఉమేష్, ఈసీ లక్ష్మన్,టి. ఎ. సుప్రియ అన్ని గ్రామ పంచాయతీ ల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# డిసెంబర్ 6లోగా విగ్రహాలపై ముసుగులను తొలగించాలి



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని అంబేద్కర్ భవన్లో మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించి నాయకులు నూతన జేఏసిని ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బస్ స్టేషన్ ముందు గత రెండేళ్ల క్రితం నెలకొల్పిన అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహాలపై ఉన్నటువంటి ముసుగులను డిసెంబర్ 6 లోగా తొలగించాలని డిమాండ్ చేస్తూ మహనీయుల విగ్రహాలపై ఉన్న ముసుగులను తొలగించడంలో జేఏసి తీసుకునే ప్రతీ నిర్ణయానికి ప్రతి సభ్యుడు కట్టుబడి పనిచేయాలని,విగ్రహాల ముసుగులను తొలగించేందుకు నిరసన కార్యక్రమాలను రూపొందించి డిసెంబర్ 6 లోగా కార్యాచరణ కోసం ఏర్పాట్లు చేయాలని సభ్యులు కార్యక్రమంలో ముక్త కంఠంతో పేర్కొన్నారు.నూతన జేఏసి కన్వీనర్ లు గా మాతంగి శంకర్, సుగుర్తి జగదీశ్వరాచారి, వంతడుపుల సంపత్, దుండ్ర రాజయ్య,బోయిని తిరుపతి,అంబాల సతీష్ లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యక్రమంలో ముఖ్య నాయకులు బోయిని కొమురయ్య, కనకం రాములు,మాతంగి అశోక్, ఎడ్ల జోగిరెడ్డి, మీసాల అంజయ్య,మాతంగి లక్ష్మణ్, బోయిని తిరుపతి,సముద్రాల లక్ష్మణ్,కనకం ఆంజనేయులు,పార్నాంది జలపతి, కోరెపు లక్ష్మణ్, బోయిని కృష్ణబాబు,వేల్పుల ఓదయ్య,బూట్ల శ్రీనివాస్,కిన్నెర అనిల్,రెడ్డి గాని రాజు,సందుపట్ల మల్లేశం,చింతం శ్రీనివాస్,నగునూరి బాబు,గాండ్ల శ్రీనివాస్,కొయ్యడ మురళి,ఖమ్మం కృష్ణ,రాచమళ్ళ దుర్గా ప్రసాద్,కొమ్ము సంపత్,ఉప్పులేటి రాజు,అలవాల సంపత్,అలవాల కుమార్,బోయిని దివాకర్,అఖిల పక్ష పార్టీల నాయకులతో పాటుగా మండలంలోని ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎం జె పి పాఠశాలలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని హన్మకొండ జిల్లా కమలాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తాడూరి రవీందర్ మరియు ఎన్సిసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మాదిరి పార్లమెంటులో విద్యార్థులు పాల్గొని ప్రస్తుత సమాజంలో రాజకీయ నాయకులు ప్రజా ప్రతినిధులు ఏ విధంగా పార్లమెంటులో పాల్గొని సమావేశాలు నిర్వహిస్తారో అదే విధంగా నిర్వహించడంతో అందర్నీ ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీందర్ తాడూరి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన తయారు చేసిన భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు చదవాలని రాజ్యాంగంలోని చట్టాలను బాధ్యతలను హక్కులను తెలుసుకోవాలని అన్నారు. చక్కటి భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏటీపీ మంగా టీ డబ్ల్యూ సరితపై ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కమలాపూర్ మండల్‌లో రాజ్యాంగ దినోత్సవం






**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మండలంలోని రాజ్యాంగ దినోత్సవం సందర్భముగా ఉప్పల్, నేరెళ్ల, గూడూరు, గుండేడు, మర్రిపల్లిగూడెం గ్రామపంచాయతీలకు సంబంధించిన అమృత్ సరోవర్ చెరువుల వద్ద లిరాజ్యాంగ దినోత్సవాన్నిలి ప్రజల సమక్షంలో శ్రీయుత మండల పంచాయతీ అధికారి రవి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో భాగంగా ఆ చెరువుల వద్ద ఈ ఆర్థిక సంవత్సరములో ఎక్కువ రోజులు ఉపాధి హామీలో పని చేసినటువంటి కూలీలను, పారిశుద్ధ్యము మంచిగా నిర్వహించినటువంటి మల్టీ మల్టీపర్పస్ వర్కర్లను, మంచిగా ప్లాంటేషన్ నిర్వహించిన వాచర్లను సన్మానించుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమాలలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు మరియు ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నరు.

# హర్యానా గవర్నర్‌ను కలిసిన పోరండ్ల కృష్ణ ప్రసాద్



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ను మర్యాద పూర్వకంగా శాలువాతో ఘనంగా సత్కరించారు దేశవ్యాప్తంగా ఉన్న సహకార బ్యాంకులలో కరీంనగర్ జిల్లా సహకార బ్యాంక్ కు ఉత్తమ అవార్డు రావడం జరిగిందని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో కే డి సి సి బి రవీందర్ రావు, వైస్ చైర్మన్ పింగిలి రమేష్, డైరెక్టర్ పొరండ్ల కృష్ణ ప్రసాద్ ను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందించారు.

## ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్ పేపరే కావాలి : మల్లికార్జున్ ఖర్గే

**న్యూ ఢిల్లీ (ది క్రైమ్ న్యూస్):** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లతో ఓటింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, వాటికి బదులుగా ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్స్‌నే వినియోగించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈవీఎంలలో ఎలాంటి లోపాలు లేవని, ఈవీఎంలకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులను తాము ఎంటర్‌టైన్ చేయదల్చుకోలేదని కేఏ పాల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రోజే ఖర్గే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'ఈవీఎంలను పక్కన పెట్టాలంటే మనం అందరం ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. నేను ఎన్నికల గురించి మాట్లాడాలనుకోవడం లేదు. అయితే ఈవీఎంల కారణంగా పేద, బడుగు బలహీన వర్గాల ఓట్లు వృథా అవుతున్నాయి. వాళ్లంతా బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌నే కోరుకుంటున్నారు' అని ఖర్గే చెప్పారు. ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరిగిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు.'ఈవీఎంలు వాళ్ల దగ్గరే పెట్టుకోనివ్వండి. మాకు ఈవీఎంలు వద్దు. మేం బ్యాలెట్ పేపర్‌తో జరిగే ఓటింగ్‌ను కోరుకుంటున్నాం.' అని ఖర్గే అన్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ కోసం రాహుల్‌గాంధీ మరోసారి భారత్ జోడో యాత్ర చేయాలని ఖర్గే కోరారు. బ్యాలెట్ పేపర్ ఓటింగ్ అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని అన్నారు.

# దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి

## - హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**జమ్మికుంట నవంబర్ 26 (ది క్రైమ్ న్యూస్):** ఈనెల 29న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో జరగనున్న దీక్ష దివస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేసి కాంగ్రెస్ పార్టీకి దిమ్మ తిరిగేలా చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ లోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దీక్షా దివస్ సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దీక్షా దివాస్ సందర్భంగా కరీంనగర్‌కి వచ్చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి ఘన స్వాగతం పలకాలి అన్నారు. దీక్షా దివస్ కార్యక్రమాన్ని కూడా ప్రతి నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు హాజరై ఉద్యమాలకు కరీంనగర్ ఊపిరి పోస్తుందని నిరూపించాలన్నారు. తెలంగాణ ప్రజలు మరోసారి కాంగ్రెస్ పాలనలో ఇంకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు



గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై మరో ఉద్యమం కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలి డిప్యూటీ చెర్మన్ బండ ప్రకాశ్, మాజీ మంత్రి గంగుల కమలాకర్, జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణరావు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ జడ్పీ చైర్పర్సన్ కనుమల్ల విజయ, బండ శ్రీనివాస్ హుజురాబాద్ నాయకులూ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు సంఘం ప్రతినిధులతో

# ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం

## - ఏరియాకు సంబంధించిన పదకొండు అంశాలపై చర్చ - సమావేశంలో రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 26:** రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు తో గుర్తింపు సంఘం ఏరియా బ్రాంచ్ సెక్రటరి యం.రామచంద్రరెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. వివిధ గనులలో ఓవర్‌మెన్, ఫోర్‌మెన్, టెక్నీషియన్ల కొరతను తీర్చండి, టెక్నీషియన్ లకు అవసరమైన కొత్త పనిముట్లలను ఏర్పాటు చేయాలి, షావల్స్, డంపర్‌లు, డోజర్‌లు, డ్రిల్స్ లలో ఎ.సి సదుపాయాన్ని కొనసాగిస్తూ సరిపడ విడిబాగాలను సమకూర్చాలి, ఓసిపి-టు ఉపరితల గనిలో క్రషర్లు, స్ప్రెడర్స్ ల సాంకేతికతను ఉపయోగించి, డీజిల్ వాడకం తగ్గించాలి. ఓబి(మట్టి వెలికితీత) ఒక క్యూబిక్ మీటర్ తీయడం వలన అధిక డీజిల్ వాడకం అవుతుంది, పన్నూరు క్రాస్ రోడ్డు నుండి అడ్రియాల లాంగ్ వాల్ గని వరకు ఉన్న రోడ్డు మరమ్మతులు చేసి రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగించాలి. సీహెచ్పి కన్వేయర్ ఆపరేటర్లు, సెక్యూరిటి ఉద్యోగులు, డ్రైవర్లకు వెచ్చని కోట్లు ఇవ్వాలి, జనరల్ మజ్దూర్ (సర్ఫేస్), సూపర్‌వైజర్లు మొదలైన పోస్టుల కోసం ఆర్.జి-త్రీ ఏరియాలో




గుర్తించబడిన అన్ని ఖాళీలను అడ్రియాల లాంగ్ వాల్ గని నుండి మాత్రమే భర్తీ చేయాలి, ఆర్.జి-త్రీ , ఎపిఎ ఏరియా లోని అన్ని గనులు, ఓపెన్‌కాస్ట్‌లలో క్యాంటీన్లను ఆధునీకరించాలి, ఎ.సి సౌకర్యం కల్పించాలి, కంపెనీ క్వార్టర్స్‌లో ప్రతిరోజూ శుద్ధి చేసిన నీటిని అందించాలి. కొత్త డ్రైన్లు, కొత్త శానిటరీ పైపులైన్లు వేయాలి, ఉపరితల గనులలో నిర్దేశించిన లక్ష్యాలను సాదించిన ప్రతినెల ప్రోత్సాహక బహుమతులు ప్రతి ఉద్యోగికి ప్రకటించాలి, అడ్రియాల లాంగ్ వాల్ గని హై టెక్నాలజీ గల మైన్ ఇందులో చాలా కాలం నుంచి పనిచేస్తున్న వారికి పదోన్నతులు కల్పించాలి. అలాగే గనిలోని ప్రతి ఉద్యోగికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి. లాంటి పదకొండు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జి.యం.లు మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కార్పొరేట్ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో సెంట్రల్ సెక్రటరి జూపాక రాంచందర్, స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు డి.టి.రావు, ఎస్. విజయ్ రాఘవ, ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖర బాబు, ఎస్వోటుజిఎంలు జి.రఘుపతి, బి.సత్యనారాయణ, ఏరియా సేఫ్టి ఆఫీసర్ యం. రామ్మోహన్, డిజిఎం కె.చంద్రశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, మేనేజర్లు ఉదయ్ హరిజన్, కె.వి.రామారావు, సీనియర్ పిఒ మతీన్ హుస్సేన్, వివిధ గనుల, విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

# బాలికల వసతి గృహంలో

# విద్యార్థినితో నగ్న పూజకు యత్నం!

## - మంథని హాస్టల్లో బాలికకు నగ్న పూజల పేరిట వంట మనిషి వల - విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు - పోక్సో చట్టం కింద కేసు నమోదు

**రామగిరి (ది క్రైమ్ న్యూస్)నవంబర్ 26:** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ఓ హాస్టల్లో విద్యార్థినికి నగ్న పూజల పేరిట హాస్టల్ వంట మనిషి వల వేసిన ఘటన మంథని పట్టణంలో సోమవారం రాత్రి కలకలం సృష్టించింది. హాస్టల్లో ఉంటున్న ఓ బాలికకు డబ్బు ఆశ చూపి మహిళ వంట మనిషి నగ్న పూజలకు సహకరించాలని కోరింది. నగ్న పూజలు చేస్తేనే లక్ష్మి కటాక్షిస్తుందని నమ్మించి, వారం రోజుల క్రితం హాస్టల్ వర్కర్ కొందరు పూజలు చేసే వారిని సంప్రదించినట్లు సమాచారం. దీంతో ఆందోళన చెందిన బాలిక హాస్టల్ నుంచి తప్పించుకుని బంధువుల ఇంటికి వెళ్లి వారం రోజులుగా అక్కడే ఉండి, సోమవారం తల్లిదండ్రులు రావడంతో వారికి విషయం మొత్తం తెలిపింది. దీంతో బాలిక బంధువులు, తల్లిదండ్రులు హాస్టల్ కు చేరుకోని వంట మనిషిని నిలదీశారు. ఆమెతో వాగ్వాదానికి దిగడంతో





హాస్టల్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులకు సమాచారం అందడంతో మంథని సీఐ రాజు, ఎస్ఐ రమేష్, హాస్టల్ వద్దకు వెళ్ళి విచారణ చేపట్టారు. గత కొంతకాలంగా మంథని నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ హాస్టల్లో పేద ఆడపిల్లలకు లక్ష్మి కటాక్షం పేరుతో వ్యభిచారం చేయిస్తున్నారని, ప్రచారం, నిన్నటి సంఘటనతో వెలుగులోకి వచ్చింది. మంథనిలో గత కొన్ని రోజులుగా అక్రమ దందాలపై ఉక్కు పాదం మోపుతున్న పోలీసులు వ్యభిచార దందాను, నిర్వాహకులను పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రలోభ పెట్టిన మహిళను అదుపు లోకి తీసుకుని పోలీసుస్టేషన్ కు తరలించారు. బాలిక తల్లిదండ్రులు స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో మంథని లో ఈ ఘటన ఒక్కసారిగా సంచలనం సృష్టించింది.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

# క్షేమంగా, గమ్యం చేరండి..

## - హుజురాబాద్ సిఐ తిరుమల్





**హుజురాబాద్ నవంబర్ 26 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ తో హుజురాబాద్ పోలీసు వారు సంయుక్తంగా పట్టణం లో అంబేద్కర్ చౌరస్తా దగ్గర ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఇందులో చైతన్య స్కూల్ విద్యార్థులు రహదారి నుండి వెళ్లే మోటార్ వాహనదారులకు హెల్మెట్, సీట్ బెల్ట్, మైనర్ డ్రైవింగ్ తదితర అంశాలపై అవగాహన పోలీసు వారి సహాయంతో కల్పిస్తూ వారికి గులాబీ పువ్వులను ఇవ్వడం జరిగింది. ఇట్టి ప్రోగ్రాంలో విద్యార్థుల పాటు హుజురాబాద్ పోలీసు వారు పాల్గొని అందరికీ అవగాహన కల్పించడం జరిగింది. ప్రజలు వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని విధిగా హెల్మెట్స్, సీట్ బెల్ట్, ధరించాలని మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణ ఇన్స్పెక్టర్ తిరుమల్ అవగాహన కల్పించడం జరిగింది.ప్రజలకు స్కూలు విద్యార్థులచే అవగాహన కార్యక్రమం చేపట్టిన హుజురాబాద్ ఇన్స్పెక్టర్‌ను, విద్యార్థులను పలువురు అభినందించడం జరిగింది.

# ముత్తారంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**ముత్తారం.నవంబర్.26.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని అన్ని గ్రామాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓడేడు గ్రామంలో ఎంపీడీవో సురేష్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఉపాధి హామీ పనుల్లో వంద పని దినాలను పూర్తి చేసిన కూలీ తోట శంకర్, మల్టీపర్పస్ వర్కర్స్ ఎండి.మున్నా, రాజ్ కుమార్,రవీందర్, సారయ్యలను ముత్తారం ఎంపిడిఓ సురేష్ శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంధ్య, కారోబార్ ప్రభాకర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

## - జడ్పీ సీఈఓ నరేందర్



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 26:-** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర సర్వేలో సేకరించిన వివరాలను ఆన్ లైన్ లో నిక్షిప్తం చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ నరేందర్ సూచించారు.రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈఓ నరేందర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి,ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన వివరాలను ఆపరేటర్లు ఆన్లైన్లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఒక్కో దరఖాస్తు వివరాలను ఆన్లైన్లో నిక్షిప్తం చేసేందుకు ఎంత సమయం పడుతోందని జడ్పీ సీఈఓ ప్రశ్నించగా, సుమారు 15 నిమిషాల వ్యవధి అవుతోందని ఆపరేటర్లు తెలిపారు. ఎన్యూమరేటర్, సూపర్వైజర్ల లింక్ ను జతపరుస్తూ, వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తున్నామని అన్నారు. నిబంధనలను పక్కాగా పాటిస్తూ, అన్ని వివరాలను ఆన్లైన్లో జాగ్రత్తగా నమోదు చేయాలని జడ్పీ సీఈఓ నరేందర్ హితవు పలికారు. త్వరితగతిన ఆన్లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని, శిక్షణ సందర్భంగా సూచించిన అంశాలను తు.చ తప్పకుండా పాటించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు, తప్పిదాలకు ఆస్కారం లేకుండా చిత్తశుద్ధితో..విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆన్లైన్లో వివరాలు నమోదు సందర్భంగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురైనా,సాంకేతికపరమైన సమస్యలు ఏవైనా ఉత్పన్నం అయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల ఎంపిడిఓ శైలజా రాణి, సూపరిండెంట్ ఉమేష్ ,పంచాయతీ కార్యదర్శులు ,ఎన్యూమరేటర్స్ , డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గోన్నారు.

# డయాబెటిస్ పేషెంట్స్ కొబ్బరి నీళ్లు తాగొచ్చా.? నిపుణులు ఏమంటున్నారు



కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచిదని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇందులోని ఎలక్ట్రోలైట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మరీ ముఖ్యంగా సమ్మర్‌లో కొబ్బరి నీళ్లు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీళ్లు రుచి విషయంలో తియ్యగా ఉంటాయి. దీంతో డయాబెటిస్ రోగులు కొబ్బరి నీళ్లు తాగ కూడదనే భావనలో ఉంటారు. ఇంతకీ డయాబెటిస్ రోగులు కొబ్బరి నీళ్లు తీసుకుంటే ఎమైనా ప్రమాదం ఉంటుందా.? నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పాల కంటే కొబ్బరి నీటిలో ఎక్కువ పోషకాలు లభిస్తాయి. ఇందులోని కొవ్వు పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. క్రమం తప్పకుండా తినే వ్యక్తులు వారి శరీరంలో పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లను పొందుతారు. లేత కొబ్బరి నీటిని తాగడం వల్ల శరీరం నుంచి ట్యాక్సిన్లు తొలగిపోతాయి. అయితే కొబ్బరి నీళ్లు తియ్యగా ఉంటాయి కాబట్టి డయాబెటిస్ పేషెంట్లకు మంచిది కాదనే అభిప్రాయంలో నిజం లేదని నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీటిని ఎలాంటి సందేహం లేకుండా తాగొచ్చని చెబుతున్నారు. కొబ్బరి నీళ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ (జిఐ) తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. లేత కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కొబ్బరిని తాగడం వల్ల శరీరంలో డీహైడ్రేషన్ సమస్య రాకుండా చూస్తుంది. ఇక కొబ్బరి బోండ లోపల ఉండే కొబ్బరిని కూడా తినొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇందులో మెటబాలిజం మెరుగుపరచడంలో సహాయపడే అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే, క్రీమ్ తినడం వల్ల శరీర కొవ్వు తగ్గుతుంది, అందువల్ల క్రీమ్‌ను రెగ్యులర్ డైట్‌లో భాగం చేసుకోవాలి. ఇందులో మంచి కొలెస్ట్రాల్ ఉంటుంది, ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.



# తులసి నీళ్లు రోజూ తాగితే అమృతం తాగినట్లే..! అందం, ఆరోగ్యంతో పాటు బోలెడు ప్రయోజనాలు!

యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబయల్ లక్షణాలు నిండివున్న తులసి రోగనిరోధక వ్యవస్థను పునరుద్ధరించడానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. ఈ వేడి సీజన్‌లో తులసి నీటిని తాగడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల జీర్ణ సమస్యలు, కడుపునొప్పి, గ్యాస్, అసిడిటీ వంటి అసౌకర్యాల నుండి ఉపశమనం పొందవచ్చు. ఈ పానీయం శరీరాన్ని శుభ్రపరచడంలో, ఆరోగ్యకరమైన జీర్ణ ప్రక్రియను ప్రారంభించడంలో సహాయపడుతుంది. దాని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్ లక్షణాలతో, తులసి నీరు దగ్గు, జలుబు లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. శ్వాసకోశ ఆరోగ్యాన్ని సమర్థవంతంగా బలోపేతం చేస్తుంది. తులసి ఆకులు సహజమైన డిటాక్సిఫైయర్. ఉదయాన్నే పరగడుపున తులసి నీటిని తాగడం వల్ల డిటాక్సిఫికేషన్ జరుగుతుంది. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్, క్రిములు బయటకు వెళ్లిపోతాయి. జీర్ణ సంబంధ వ్యాధులు దూరంగా ఉంటాయి. తులసి నీటిని తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది. ఇందులోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు చర్మ పరిస్థితులకు చికిత్స చేయడానికి ఉపయోగపడతాయి. తులసి నీటిని తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. తులసి నీరు కార్టిసాల్ హార్మోన్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది శరీరంలో ఒత్తిడిని కలిగించే ఒత్తిడి హార్మోన్ అని కూడా పిలుస్తారు. తులసి నీటిని తాగడం వల్ల



కార్టిసాల్ స్థాయిలు తగ్గుతాయి. అలాగే మీరు ఒత్తిడి లేకుండా ఉండేందుకు సహాయపడుతుంది.

## తెల్లగా ఉన్నాయ్ ఇవేం చేస్తాయిలే అనుకునేరు.. ఆ సమస్యలకు దివ్యౌషధం..



ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు.. ఎందుకంటే.. ఉల్లిపాయల్లో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే, ఉల్లిపాయను ఆరోగ్యానికి నిధిగా భావిస్తారు.. వాస్తవానికి ఉల్లిపాయలు లేకుండా ఏ కూరగాయల రుచి కూడా బాగుండదు.. సాధ్యమైనంత మేరకు ఉల్లి లేకుండా కూరనే వండరు.. అందుకే.. ఏదిఏమైనప్పటికీ.. ఇంట్లో ఉల్లి ఉండాల్సిందే.. ఇంకా ఉల్లిపాయను సలాడ్‌లో కూడా ఉపయోగిస్తారు. వాస్తవానికి అందరి ఇళ్లల్లో ఎర్ర ఉల్లిపాయను ఉపయోగిస్తుంటారు.. ఎర్ర ఉల్లిపాయల వలే తెల్ల ఉల్లిపాయల్లో కూడా ఎన్నో పోషకాలు దాగున్నాయి. తెల్ల ఉల్లిపాయలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకోండి.. తెల్ల ఉల్లిపాయలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. జీర్ణవ్యవస్థ బలపడుతుంది : తెల్ల ఉల్లిపాయ అనేక సమస్యలను దూరం చేస్తుంది. ఈ ఉల్లిపాయను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థను బలంగా ఉంచుతుంది. ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణ ఆరోగ్యాన్ని బలపరుస్తుంది. ఇది కాకుండా, ఉల్లిపాయలో ప్రీబయోటిక్ ఉంటుంది. ఇది పొట్టను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. జుట్టు సమస్యలు దూరం: తెల్ల ఉల్లిపాయ మీ జుట్టుకు చాలా మేలు చేస్తుంది. మీకు చుండ్రు సమస్య ఉంటే తెల్ల ఉల్లిపాయ రసాన్ని వినియోగించాలి. రసాన్ని తలపై అప్లై చేసి కొంత సేపటి తర్వాత తలను శుభ్రం చేసుకోవాలి. ఇంకా తెల్ల జుట్టు సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు ప్రతిరోజూ తెల్ల ఉల్లిపాయలను తింటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. కొలెస్ట్రాల్ తగ్గుతుంది: తెల్ల ఉల్లిపాయలో చాలా పోషకాలు ఉన్నాయి. ఇవి మీ శరీరం నుంచి చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడతాయి. మీకు కూడా చెడు కొలెస్ట్రాల్ సమస్య కూడా ఉంటే, మీరు ప్రతిరోజూ తెల్ల ఉల్లిపాయలను తినడం ప్రారంభించాలి. ఇది మీ కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. గుండెకు మేలు చేస్తుంది: తెల్ల ఉల్లిపాయను తీసుకోవడం వల్ల గుండె సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీలు ఉన్నాయి.. ఇది మీ రక్తపోటును పెరగకుండా చేస్తుంది.. ఇంకా రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తుంది. అందువల్ల, మీకు గుండె సంబంధిత సమస్యలు ఉంటే, మీరు తెల్ల ఉల్లిపాయలను తీసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు.

## కేవలం రూ.20తో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి బయటపడొచ్చు.. ఎలాగో తెలుసా?



శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయదు. దీంతో రకరకాల సమస్యలు మొదలవుతాయి. యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి వేళ్ల కీళ్లలో ఇరుక్కుపోయి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. అంతేకాకుండా దీని వల్ల అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరం నుంచి యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి కొన్ని ఆహార అలవాట్లు మార్చుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. యూరిక్ యాసిడ్‌ను తగ్గించగల 5 ప్రభావవంతమైన హోమ్ రెమెడీస్ ఇవే.. ఉసిరికాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఇన్‌ఫ్లమేటరీని నివారించడమే కాకుండా, ఆక్సీకరణ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఇది యూరిక్ యాసిడ్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. కాబట్టి ప్రతి రోజూ కనీసం ఒక ఉసిరికాయను తినడం అలవాటు చేసుకోవాలి. ఎండిన కొత్తిమీర ఆకులు శరీరం నుంచి యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో సహాయపడతాయి. కొత్తిమీర ఆకుల్లో యూరిక్ యాసిడ్ ను మూత్రంతో తొలగించే గుణాలు ఉంటాయి. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగిన వ్యక్తులు కొత్తిమీర టీ లేదా కొత్తిమీర నీటిని తీసుకుంటే మంచిది. యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో వేప ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేపలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇది వాపును తగ్గిస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ సమస్యను నయం చేస్తుంది. వేప శరీరం మొత్తం నిర్విషీకరణలో కూడా బాగా పనిచేస్తుంది. రోజువారీ ఆహారంలో చేపలు తినడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి కూడా సహాయపడుతుంది. దీని కారణంగా టాక్సిన్స్ తొలగిపోతాయి. ఫలితంగా యూరిక్ యాసిడ్ శరీరం నుంచి సులభంగా బయటికి పోతుంది. ఆయుర్వేదంలో కరక్కాయ (మైరోబాలన్)కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో నిర్విషీకరణ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని టాక్సిన్స్, యూరిక్ యాసిడ్‌లను సులువుగా బయటకు పంపుతుంది. మైరోబాలన్ తీసుకోవడం జీర్ణక్రియకు కూడా మంచిది. దీని సహాయంతో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. అలాగే గట్ సమస్యలు కూడా నయమవుతాయి.

## చామదుంపలో ఉండే ఈ గుణం గుండె జబ్బులు రాకుండా అడ్డుకుంటుంది..! డయాబెటీస్‌కు బెస్ట్ ఫుడ్..!!



విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ ఇ, విటమిన్ బి 6, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్న చామదుంపలు చాలా ఇళ్లలో ఇష్టంగా తింటారు. దాని రుచిని ఇష్టపడని వారు కూడా ఉన్నారు. మీరు కూడా అలాంటి వారిలో ఒకరైతే, ఈ రోజు మేము దాని ప్రయోజనాలను మీకు తెలియజేస్తాము. ఇది తెలిసిన తర్వాత మీరు తప్పక మీ ఆహారంలో భాగంగా చేర్చుకుంటారు. వేసవిలో బలహీనమైన రోగనిరోధక శక్తిని పెంచడంలో, అనేక శరీర సమస్యల నుండి ఉపశమనం పొందడంలో చామగడ్డను తినడం ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాం. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.. చామగడ్డలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి దీని వినియోగం శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఎక్కువ ఫైబర్ తినడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. మొత్తంమీద, దీనిని తినడం వల్ల మీ మొత్తం గుండె ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుతుంది. బరువు తగ్గడంలో ప్రయోజనకరంగా ఉంటుంది.. ఊబకాయంతో బాధపడేవారికి చామదుంపలు తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా పనిచేస్తుంది. వేసవిలో దీనిని తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. అటువంటి పరిస్థితిలో మీకు ఎక్కువసేపు ఆకలి అనిపించదు. అదనపు కేలరీలను తీసుకోకుండా మిమ్మల్ని మీరు ఆపుకోగలుగుతారు. దీని ప్రభావం బరువులో కనిపిస్తుంది. ఈ విధంగా చామగడ్డను మీ ఆహారంలో భాగం చేసుకోవటం వల్ల బరువు తగ్గడానికి చాలా మంచిది. కళ్లకు మేలు చేస్తుంది.. బీటా-కెరోటిన్, క్రిప్టోక్సాంటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నందున చామగడ్డ తీసుకోవడం వల్ల మీ కళ్ళు ఆరోగ్యంగా ఉంటాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రెటీనా దెబ్బతినకుండా కాపాడతాయి. కంటిశుక్లం ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. అటువంటి పరిస్థితిలో చిన్న వయస్సులోనే కంటి సంబంధిత సమస్యలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ప్రారంభించినట్లయితే, ఆహారంలో చామగడ్డను తరచుగా చేర్చుకోవడం మంచిది. కండరాలు, ఎముకలకు మేలు చేస్తుంది. చామదుంప రెగ్యులర్ వినియోగం కండరాలు, ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది . ఐరన్, కాపర్, మెగ్నీషియం, జింక్ వంటి అనేక పోషకాలుఈ కూరగాయలలో ఉన్నాయి. ఇది ఎముకల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతాయి.. చాలా మంది ప్రజలు వేసవిలో తక్కువ రోగనిరోధక శక్తితో పోరాడుతున్నారు. అటువంటి పరిస్థితిలో చామదుంపను రెగ్యూలర్‌గా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సీజన్‌తో పాటు పెరిగే ఇన్‌ఫెక్షన్లతో పోరాడడంలో శరీరానికి సహాయపడుతుంది. దీని వినియోగం విటమిన్ సి లోపాన్ని కూడా తొలగిస్తుంది. ఇది ఫ్రీ రాడికల్ డ్యామేజ్ నుండి మిమ్మల్ని రక్షిస్తుంది.

## అలర్ట్.. డయాబెటిస్‌ను కంట్రోల్ చేసే ఏడు సూత్రాలు.. ఇలా చేస్తే 400 ఉన్న షుగర్ 100కు రావడం ఖాయం..



ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలో హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. హార్మోన్ల కారణంగా దీర్ఘకాలిక వ్యాధులు మీ శరీరంలో వేళ్లూనుకునే అవకాశం ఉంది. ఉదాహరణకు, థైరాయిడ్ హార్మోన్లలో హెచ్చుతగ్గులు హైపో లేదా హైపర్ థైరాయిడిజానికి దారితీస్తాయి. అదేవిధంగా, ఇన్సులిన్ అనే హార్మోన్ ఉత్పత్తి కాకపోయినా లేదా సరిగ్గా పని చేయకపోయినా, రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణంగా ఉండవు. చాలా సందర్భాలలో, చక్కెర స్థాయి పెరుగుతుంది. దీనివల్ల మధుమేహం, ప్రీ-డయాబెటిస్, టైప్-2 మధుమేహం వంటి సమస్యలు వస్తాయి. మధుమేహంతో పాటు, ఇన్సులిన్ నిరోధకత కొలెస్ట్రాల్ స్థాయిలు, థైరాయిడ్ పనితీరు, రక్తపోటును కూడా ప్రభావితం చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆహారం ద్వారా ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలను నిర్వహించవచ్చు.. అలాంటి ఆహార పదార్థాలు ఏంటో తెలుసుకోండి.. ఏడు సూత్రాలతో డయాబెటిస్‌కు చెక్.. మెంతులు దనియాల నీరు: మెంతులు, దనియాల నీటిని రోజూ తీసుకోవడం వల్ల ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలు అదుపులో ఉంటాయి. 1/2 టీస్పూన్ మెంతి గింజలు, 1 టీస్పూన్ దనియాలను ఒక గ్లాసు నీటిలో వేసి మరిగించి తాగండి.. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కూడా అదుపులో ఉంచుతుంది. గుండెల్లో మంటగా ఉన్నా.. అజీర్ణంతో బాధపడుతున్నా ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది. ఉసిరి అలోవెరా జ్యూస్: ఉసిరి, కలబంద రెండూ ఇన్సులిన్ నిరోధక సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఈ పానీయంలో విటమిన్ సి ఉంటుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తి, పనితీరును నిర్వహించడానికి సహాయపడుతుంది. ఈ పానీయం రక్తంలోని అదనపు గ్లూకోజ్‌ను గ్రహిస్తుంది. సరైన పద్ధతిలో ఆహారాన్ని తినండి: ఆహారంలో సరైన మొత్తంలో ఫైబర్, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు ఉండాలి. రోజు ప్రారంభంలో ఫైబర్ తీసుకోండి. ఆ తర్వాత ప్రోటీన్.. చివరకు పిండి పదార్థాలు లాంటివి తీసుకోవాలి.. అయితే. మితంగా తినడం మాత్రం మర్చిపోవద్దు.. ప్రొటీన్లు పుష్కలంగా ఉండే ఆహారం: శరీరంలో ప్రొటీన్ల లోపాన్ని తీర్చడానికి గుడ్లు, చికెన్, బాదం, కాజు, పప్పులు వంటివి తినండి.. ఇటువంటి ఆహారాలు ఇన్సులిన్ హార్మోన్ ప్రభావాన్ని పెంచుతాయి. రోజులో ఏదైనా భోజనంలో ప్రొటీన్ తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే బ్లడ్ షుగర్ లెవెల్ మెయింటెయిన్ అవుతుంది. దాల్చిన చెక్క నీరు:దాల్చిన చెక్కఇన్సులిన్ నిరోధకత..రక్తంలోచక్కెర స్థాయిలను నియంత్రించడంలో గ్రేట్ గా పనిచేస్తుంది.ఈ మసాలాలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలో మంటను తగ్గిస్తాయి. దాల్చిన చెక్క పొడిని వేడి నీటిలో మరిగించి తాగాలి..రోజులో ఏదో ఒకపూట ఈ డ్రింక్ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. పుష్కలంగా నీరు త్రాగండి: ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలను నిర్వహించడానికి..వ్యాధి ప్రమాదాన్ని తగ్గించడానికి పుష్కలంగా నీరు త్రాగాలి. రోజంతా 3-4 లీటర్ల నీరు త్రాగాలి..దీనివల్ల హైడ్రేట్‌గా కూడా ఉంటాం..రాత్రి భోజనం తర్వాత నడవండి: రాత్రి భోజనం చేసిన తర్వాత పడుకోకండి. రాత్రి భోజనం తర్వాత కనీసం 15 నుంచి 30 నిమిషాల పాటు నడవండి. ఇది ఆహారాన్ని జీర్ణం చేస్తుంది.. వ్యాధి ప్రమాదాన్ని నివారిస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి.



# వ్యాపారం

## మీ హోమ్‌లోన్ ఈఎంఐని తగ్గించుకోవడానికి ఐదు మార్గాలు



రెపో రేటును స్థిరంగా ఉంచడం ద్వారా భారతీయ రిజర్వ్ బ్యాంక్ రుణగ్రహీతలకు ఊరటనిచ్చింది. చాలా మంది గృహ రుణ గ్రహీతలు లలో కొంత ఉపశమనం పొందుతారని ఆశించారు. ఆర్బీఐ మీ తగ్గించకపోయినా, మీరు ఈ 5 చిట్కాల సహాయంతో మీ వాయిదాలను తగ్గించుకోవచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా 7వ సారి రెపో రేటును 6.50 శాతం వద్ద స్థిరంగా ఉంచింది. బ్యాంకులు ఆర్‌బిఐ రెపో రేటు ఆధారంగా గృహ రుణాలు, కారు రుణాలు, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయిస్తాయి. హోమ్ లోన్ తగ్గించడానికి చిట్కాలు: మీకు మంచి సిబిల్ స్కోర్ ఉంటే, మీరు మీ బ్యాంక్ నుండి గృహ రుణంపై తక్కువ వడ్డీ రేటును పొందవచ్చు. మీ సిబిల్ స్కోర్ కాలక్రమేణా మెరుగుపడుతున్నప్పటికీ, హోమ్ లోన్‌పై వడ్డీని తగ్గించడానికి మీరు మీ బ్యాంక్‌తో చర్చలు జరపవచ్చు. మీ రుణంపై వడ్డీని తగ్గించడానికి తరచుగా బ్యాంక్ మేనేజర్‌కు తగినంత మార్జిన్ ఉంటుంది. గృహ రుణ ఈఎంఐలను తగ్గించడానికి ఒక మార్గం ఫ్లోటింగ్ వడ్డీ రేటుకు మారడం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన రెపో రేటును తగ్గించిన తర్వాత మీ కూడా తదనుగుణంగా తగ్గుతుంది. మీరు మీ నెలవారీ తగ్గించుకోవాలనుకుంటే, మీరు మీ లోన్ కాలపరిమితిని పొడిగించవచ్చు. ఇది మీ నెలవారీ హోమ్ లోన్ తగ్గిస్తుంది. హోమ్ లోన్ ఈఎంఐని తగ్గించడానికి మరొక మార్గం మీ లోన్‌ని మరొక బ్యాంకుకు పోర్ట్ చేయడం. ఇది మీ నెలవారీ ఈఎంఐని తగ్గించడంలో మీకు సహాయపడుతుంది. రుణాన్ని పోర్ట్ చేయడంపై, కొత్త బ్యాంక్ తరచుగా తన కస్టమర్లకు తక్కువ వడ్డీ రేట్లను అందిస్తుంది. మీ హోమ్ లోన్ ఈఎంఐని తగ్గించుకోవడానికి మీరు ప్రతి సంవత్సరం ఒకటి నుండి రెండు అదనపు ఈఎంఐలను చెల్లించవచ్చు. దీని వల్ల రెండు ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి మీ లోన్ కాలపరిమితి తగ్గుతుంది. రెండవది మీ ఈఎంఐ కూడా తగ్గుతుంది.

## రికార్డ్ బద్దలు కొడుతున్న బంగారం, వెండి ధరలు



చైనా నుండి పెరుగుతున్న డిమాండ్ కారణంగా వెండి ప్రపంచంలోని అన్ని లోహాలకు రెక్కలొస్తున్నాయి.ఆదాయాన్ని ఆర్జించే శక్తి బంగారంలోనే కాదు వెండికి కూడా ఉందనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. శనివారం వెండిపై ఏకంగా రూ.1800 వరకు పెరిగి ప్రస్తుత ధర రూ.83,500లకు చేరుకుంది. ఏప్రిల్ నెలలో వెండి ధర దాదాపు 8 శాతం పెరిగింది అంటే దాదాపు రూ.6000 పెరిగింది. మరోవైపు, బంగారం గురించి మాట్లాడితే, ఫ్యూచర్స్ మార్కెట్‌లో ధరలు రూ.70 వేలకు చేరుకున్న తర్వాత కూడా, 4 శాతానికి పైగా పెరుగుదల కనిపించింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, చైనాలో మెరుగైన తయారీ గణాంకాల కారణంగా, వెండికి డిమాండ్ పెరిగింది. అదే సమయంలో, ఇతర మూల లోహాలకు డిమాండ్ పెరగడంతో, ధరలు పెరిగాయి. వెండి ధరలు ఏ స్థాయికి చేరుకున్నాయో తెలుసుకుందాం. రికార్డు స్థాయిలో వెండి ధరలు: దేశంలోని ఫ్యూచర్స్ మార్కెట్‌లో వెండి ధరలో భారీ పెరుగుదల కనిపించింది. ధరలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఎంసీఎక్స్ డేటా ప్రకారం.. రానున్న రోజుల్లో వెండి ధర మరింత పెరిగే అవకాశం ఉంది. ఎంత పెరిగింది గత వారం ఒక నెల గురించి మాట్లాడుకుంటే దాదాపు 8 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఏప్రిల్ నెలలో వెండి ధర రూ.5,982 పెరిగింది. మరోవైపు, గత నెలలో వెండి ధర 9 శాతానికి పైగా పెరిగింది. అంటే ఒక నెలలో వెండి ధరలో రూ.6,892 పెరుగుదల కనిపించింది. గతేడాది చివరి ట్రేడింగ్ రోజున వెండి ధర రూ.75,500గా ఉంది. ఇందులో ఇప్పటి వరకు రూ.దాదాపు రూ.6000 వరకు పెరుగుదల కనిపించింది. అంటే ప్రస్తుత సంవత్సరంలో వెండి పెట్టుబడిదారులకు 7.32 శాతం ఆర్జించింది. రికార్డు స్థాయిలో బంగారం ధరలు ఇక బంగారం విషయానికొస్తే.. ఏప్రిల్‌లో తొలిసారిగా రూ.70 వేలు దాటింది. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి 10 గ్రాముల బంగారంపై 1300 వరకు ఎగబాకిందంటే ధర ఏ మేరకు పెరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. బంగారం ధర రూ.71,290కి చేరుకుంది. ఇక నిన్న మార్కెట్ ముగిసిన తర్వాత పది గ్రాముల బంగారం ధర రూ.70,636గా నమోదైంది. ఒక రోజు క్రితం బంగారం ధర పడిపోయి రూ.69,297 వద్ద ప్రారంభమైంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత కారణంగా బంగారం ధర పెరుగుదల కనిపిస్తోంది. రానున్న రోజుల్లో బంగారం ధర కూడా రూ.72 వేల స్థాయిని దాటే అవకాశం ఉంది. బంగారం ఎంత సంపాదించింది? ప్రస్తుత సంవత్సరంలో బంగారం వెండి కంటే ఎక్కువ సంపాదించింది. ఈ సమయంలో బంగారం ధరలో రూ.6673 పెరుగుదల కనిపించింది. అంటే ఇన్వెస్టర్లు బంగారంలో 10 శాతానికి పైగా పెరుగుదల కనిపించింది. గత నెల రోజులుగా మనం మాట్లాడుకుంటే, ఈ కాలంలో బంగారం ధర రూ.5,059 పెరిగింది. అంటే బంగారం పెట్టుబడిదారులకు 7.70 శాతం లాభాన్ని అందించింది. మరోవైపు, గత వారం లేదా ఏప్రిల్ నెలలో, బంగారం వెండి కంటే తక్కువ సంపాదించింది. ఏప్రిల్ నెలలో బంగారం ధర రూ.2,998 పెరిగింది. అంటే ఈ కాలంలో బంగారం పెట్టుబడిదారులకు 4.43 శాతం ఆదాయాన్ని ఇచ్చింది. చైనా తయారీ రంగం మెరుగుపడిందని హెచ్‌డిఎఫ్‌సి కమోడిటీ అండ్ కరెన్సీ హెడ్ అనూజ్ గుప్తా అన్నారు. దీంతో మూల లోహాల ధరల్లో పెరుగుదల కనిపిస్తోంది. స్పాట్ సిల్వర్‌లో కనిపించిన పెరుగుదల సిల్వర్ ఫ్యూచర్లలో అంతగా లేదు. మరోవైపు, రాగి, ఇతర మూల లోహాలలో కూడా పెరుగుదల కనిపిస్తోంది. రానున్న రోజుల్లో వెండికి ఎంత డిమాండ్ పెరిగితే, ధరలు అంతగా పెరిగే అవకాశం ఉంది. చైనా తయారీ రంగం వృద్ధి కారణంగా వెండికి పారిశ్రామిక డిమాండ్‌లో పెరుగుదల కనిపిస్తోంది.

## హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌ను ఎప్పుడెప్పుడు రిజెక్ట్ చేస్తారో తెలుసా?

ఈ రోజుల్లో హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరికి అవసరమే. కరోనా తర్వాత చాలా మంది ఆరోగ్య బీమాను తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే చికిత్సకు అయ్యే ఖర్చును లెక్కలోకి తీసుకుంటే.. ఆరోగ్య బీమా అవసరం. ఇది ఆసుపత్రి ఖర్చుల వల్ల మీరు ఆర్థికంగా చితికిపోకుండా చేస్తుంది. కుటుంబంలోని ఇద్దరు, ముగ్గురికి సాధారణ వైరల్ లేదా డెంగ్యూ సోకితే, ఆసుపత్రి బిల్లు 2-3 లక్షలు అవుతుంది. గుండె ఆపరేషన్, లేదా కిడ్నీ మార్పిడి అవసరమైతే ఖర్చు రూ.10 నుంచి 15 లక్షలకు చేరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్య బీమా లేకపోతే, అప్పుల్లో కూరుకుపోవడం ఖాయం. ఒక్కోసారి ఆరోగ్య బీమా ఉన్నా.. మీరు దాని ప్రయోజనాన్ని పొందలేరు. ఎందుకంటే బీమా కంపెనీ క్లెయిమ్‌ను చెల్లించడానికి నిరాకరిస్తుంది. ఒక పాలసీదారుగా, మీరు దీనికి కారణాలను తెలుసుకోండి. కొన్ని కారణాల వల్ల ఆరోగ్య బీమా క్లెయిమ్‌ను కంపెనీ తిరస్కరించవచ్చు.


# పన్ను చెల్లింపు విధానంలో కీలక మార్పులు..

## పాత, కొత్త పన్ను విధానాల మధ్య ప్రధాన తేడాలివే..!




కొత్త ఆర్థిక సంవత్సరం 2024-25, ఏప్రిల్ 1న ప్రారంభమైనందున పన్ను చెల్లింపుదారులు పాత, కొత్త ఆదాయపు పన్ను విధానాల్లో మధ్య తేడాల గురించి తెలియక పన్ను చెల్లింపుదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు విధానాలపై వర్తించే ఆదాయపు పన్ను రేట్లు, స్లాబ్ గురించి తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొత్త ఆదాయపు పన్ను విధానం ఎఫ్‌వై 2023-24 నుండి డిఫాల్ట్ ఎంపికగా మారింది. పన్ను చెల్లింపుదారుల నుంచి వారి ప్రాధాన్య పన్ను విధానం గురించి చురుకైన నిర్ణయం అవసరం. ఈ నేపథ్యంలో కొత్త, పన్ను చెల్లింపు విధానానాల్లో ప్రధాన తేడాలను తెలుసుకుందాం. ప్రామాణిక తగ్గింపులు గతంలో పాత పన్ను విధానంలో మాత్రమే అందుబాటులో ఉన్న రూ. 50,000 స్టాండర్డ్ డిడక్షన్ ఇప్పుడు కొత్త పన్ను విధానంలో కూడా విస్తరించారు. ఇది పన్ను చెల్లింపుదారులు తమ జీతం ఆదాయం నుండి రూ. 50,000 స్టాండర్డ్ డిడక్షను క్లెయిమ్ చేసుకోవచ్చు. పన్ను రాయితీ పరిమితి కొత్త పన్ను విధానంలో రూ. 7 లక్షల వరకు ఆదాయంపై మొత్తం పన్ను రాయితీ ప్రవేశపెట్టారు. ఇది పాత పాలనలో మునుపటి రూ. 5 లక్షల థ్రెషోల్డ్ కంటే గణనీయంగా పెరిగింది. రూ. 7 లక్షల వరకు ఆదాయం ఉన్న వ్యక్తులు కొత్త పాలనలో ఎలాంటి పన్ను చెల్లించకుండా పూర్తిగా మినహాయింపు ఉంటుంది. పాత పన్ను విధానంలో మినహాయింపులు పాత పన్ను విధానంలో మినహాయింపులు అనుమతించబడతాయి పాత పన్ను విధానంలో, పన్ను చెల్లింపుదారులు తమ పన్ను బాధ్యతలను తగ్గించుకోవడానికి అనేక రకాల తగ్గింపులు, మినహాయింపులు, భత్యాలను ఉపయోగించుకోవచ్చు. సాధారణ పన్ను పొదుపు మార్గాలలో పీపీఎఫ్, యూఎల్ఐపీలు, ఈఎల్ఎస్ఎస్, జీవిత బీమా ప్రీమియంలు, ఈపీఎఫ్ విరాళాలు, గృహ రుణ వడ్డీ, స్టాండర్డ్ డిడక్షన్, ట్యూషన్ ఫీజులు, ఆరోగ్య బీమా ప్రీమియంలు, మరిన్నింటిలో పెట్టుబడులు ఉంటాయి. కొత్త పన్ను విధానంలో మినహా యింపులు కొత్త పన్ను విధానం ఎన్‌పీఎస్‌కు విరాళాలు, అద్దె నివాసాల కోసం ప్రామాణిక తగ్గింపులు, రవాణా భత్యాలు వంటి సాపేక్షంగా తక్కువ తగ్గింపులను అందిస్తుంది. కొత్త పన్ను విధానం జీవిత బీమా ద్వారా వచ్చే ఆదాయం, విద్య కోసం స్కాలర్‌షిప్లు, పదవీ విరమణపై లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, వ్యవసాయ ఆదాయం, అద్దె ఆదాయం, జీతంపై ప్రామాణిక తగ్గింపులతో సహా సాపేక్షంగా తక్కువ తగ్గింపులను అందిస్తుంది. అయితే కొత్త పన్ను విధానంలో లీవ్ ట్రావెల్ అలవెన్స్, ఇంటి అద్దె భత్యం, స్టాండర్డ్ డిడక్షన్, సెక్షన్ 80సీ, 80డీతో సహా పాత పన్ను విధానంలో లభించే అనేక తగ్గింపులు, మినహాయింపులు కొత్త పాలనలో కవర్ అవవు. సర్‌చార్జ్ రేటు రూ.5 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న అధిక నికర విలువ కలిగిన వ్యక్తులకు సర్‌చార్జ్ రేటు 37 శాతం నుంచి 25 శాతానికి తగ్గుతుంది. సర్‌చార్జ్ ఈ తగ్గింపు వారి ప్రభావవంతమైన పన్ను రేటును తగ్గిస్తుంది. ఈ ఆదాయ బ్రాకెట్లోని వ్యక్తులకు ఉపశమనం అందిస్తుంది. ఉత్తమమైన విధానం ఏంటి? పాత, కొత్త పన్ను విధానాల మధ్య ఎంపిక వ్యక్తిగత ప్రాధాన్యతలు, ఆర్థిక లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. కొత్త పాలనను ఎంచుకునే పన్ను చెల్లింపుదారులు పెట్టుబడులలో ఎక్కువ సౌలభ్యాన్ని పొందవచ్చు. ముఖ్యంగా లాక్-ఇన్ పీరియడ్లతో కూడిన సాధనాలను నివారించేందుకు ఇష్టపడతారు. అయితే ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఒకరి ఆర్థిక పరిస్థితులు, లక్ష్యాలతో ఏ పాలన మెరుగ్గా సరిపోతుందో తెలుసుకోవడానికి ఆదాయపు పన్ను కాలిక్యులేటర్‌ను ఉపయోగించడం ఉత్తమం.

## సిబిల్ స్కోర్ విషయంలో అవన్నీ అపోహలే..! సిబిల్ స్కోర్ పెంచే సూపర్ టిప్స్ ఇవే..!




ప్రస్తుత రోజుల్లో పెరిగిన ఖర్చుల నేపథ్యంలో లోన్లు తీసుకోవడం అనేది సర్వసాధారణమైపోయింది. ఈ నేపథ్యంలో బ్యాంకులు లోన్లు అందించడానికి సిబిల్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటాయి. దీంతో ప్రతి వ్యక్తి మీ క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపరచడం అనేది మొదటి బాధ్యతగా మారింది. రుణాలు తీసుకునే చరిత్రను నిర్మించడంతో మీ క్రెడిట్‌ను చక్కగా నిర్వహించడం ద్వారా మీ క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపర్చుకోవచ్చు. క్రెడిట్ స్కోర్ అనేది సాధారణంగా 300 నుంచి 900 వరకు ఉండే మూడు అంకెల సంఖ్య, ఇది ఒక వ్యక్తికు సంబంధించిన క్రెడిట్ యోగ్యతను ప్రతిబింబిస్తుంది. ఇది మీకు రుణం ఇచ్చే ప్రమాదాన్ని అంచనా వేయడానికి రుణదాతలు ఉపయోగించే స్కోర్‌గా ఉంటుంది. అధిక స్కోర్ మెరుగైన క్రెడిట్ చరిత్రను సూచిస్తుంది. అలాగే మీ రుణ ఆమోదం, అనుకూలమైన వడ్డీ రేట్ల అవకాశాలను పెంచుతుంది. క్రెడిట్ స్కోర్‌పై అపోహలు మీ క్రెడిట్ స్కోర్‌ని నిర్ణయించడంలో చెల్లింపు చరిత్ర అత్యంత కీలకమైన అంశాలలో ఒకటి. మీరు క్రెడిట్ కార్డ్ బిల్లులు, లోన్ ఈఎంఐలు మరియు యుటిలిటీ బిల్లులతో సహా మీ బిల్లులను సకాలంలో చెల్లించారని నిర్ధారించుకోవాలి. మీ క్రెడిట్ పరిమితులకు సంబంధించి అధిక క్రెడిట్ కార్డ్ బ్యాలెన్స్‌లను నిర్వహించడం మీ క్రెడిట్ స్కోర్‌ను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది.మీ స్కోర్‌ను తగ్గించే ఎర్రర్‌లు లేదా తప్పుల కోసం మీ క్రెడిట్ నివేదికను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. క్రెడిట్ బ్యూరోతో మీరు కనుగొన్న ఏవైనా వ్యత్యాసాలను గమనించాలి. క్రెడిట్ కార్డులు, రుణాలు, తనఖాలు వంటి వివిధ రకాల క్రెడిట్‌ల మిశ్రమాన్ని కలిగి ఉండటం మీ క్రెడిట్ స్కోర్‌ను సానుకూలంగా ప్రభావితం చేస్తుంది. అయితే మీ క్రెడిట్ మిశ్రమాన్ని వైవిధ్యపరచడానికి మీకు అవసరం లేని ఖాతాలను తెరవవద్దు. పాత క్రెడిట్ ఖాతాలను మూసివేయడం వల్ల మీ క్రెడిట్ చరిత్రను తగ్గించవచ్చు, ఇది మీ స్కోర్‌ను ప్రతికూలంగా ప్రభావితం చేయవచ్చు. సుదీర్ఘ క్రెడిట్ చరిత్రను నిర్వహించడానికి మీరు వాటిని తరచుగా ఉపయోగించకపోయినా పాత ఖాతాలను తెరిచి ఉంచండి. కొత్త క్రెడిట్ కోసం తరచుగా దరఖాస్తు చేయడం వల్ల మీరు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని లేదా అధిక మొత్తంలో ఉన్నారని రుణదాతలకు సూచించవచ్చు. మీకు అవసరమైనప్పుడు మాత్రమే క్రెడిట్ కోసం దరఖాస్తు చేసుకోండి. చెల్లించాల్సిన పూర్తి మొత్తం కంటే తక్కువ రుణాలను సెటిల్ చేయడం ఇప్పటికీ మీ క్రెడిట్ నివేదికలో చూపుతుంది. తద్వారా మీ క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. సాధ్యమైనప్పుడల్లా అప్పులు పూర్తిగా చెల్లించాలని లక్ష్యంగా పెట్టుకోండి. క్రెడిట్ స్కోర్ మెరుగుదలకు చిట్కాలు క్రెడిట్ కార్డ్ ఖాతాలను మూసివేయడం వల్ల మీ క్రెడిట్ స్కోర్‌కు హాని కలిగించవచ్చు. మీ అందుబాటులో ఉన్న క్రెడిట్‌ని తగ్గించడంతో పాటు క్రెడిట్ చరిత్రను తగ్గిస్తుంది. ఈ రెండూ మీ స్కోర్‌ను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. మీరు మీ క్రెడిట్ నివేదిక లేదా స్కోర్‌ని తనిఖీ చేసినప్పుడు అది సెన్సిటివ్ విచారణగా పరిగణిస్తారు. అది మీ క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం చూపదు. అయితే రుణదాతల నుండి కఠినమైన విచారణలు మీ స్కోర్‌ను కొద్దిగా తగ్గించగలవు. మీ క్రెడిట్ కార్డ్‌పై బ్యాలెన్స్‌ని కలిగి ఉండటం వల్ల మీ క్రెడిట్ స్కోర్ మెరుగుపడదు. ఇది అధిక వడ్డీ ఛార్జీలకు దారి తీస్తుంది. మీ క్రెడిట్ వినియోగ నిష్పత్తిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. మీ ఆదాయం నేరుగా మీ క్రెడిట్ స్కోర్ లెక్కింపులో చేర్చరు. అయితే కొన్ని రకాల రుణాల కోసం మీ క్రెడిట్ యోగ్యతను అంచనా వేసేటప్పుడు రుణదాతలు మీ ఆదాయాన్ని పరిగణించవచ్చు.

## ఇకపై అమెజాన్‌లో తక్కువ ధరకే వస్తువులు..

## అందుబాటులోకి కొత్త సేవలు..




ఈ-కామర్స్ రంగంలో తనదైన ముద్ర వేసింది ప్రముఖ సంస్థ అమెజాన్. ఎక్కడో అమెరికాలో మొదలైన ఈ సంస్థ నేడు ప్రపంచమంతా విస్తరించింది అంటేనే అమెజాన్ క్రేజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే వినియోగదారులకు ఎప్పటికప్పుడు మంచి మంచి ఆఫర్లను ప్రకటిస్తూ యూజర్లను ఆకట్టుకునే అమెజాన్ తాజాగా మరో కొత్త వ్యాపారంలోకి అడుగుపెట్టింది. తక్కువ ధరలో వస్తువుల కోసం కొత్త సేవలను ప్రారంభించింది. ఆన్‌లైన్‌లో తక్కువ ధరకు వస్తువులు లభించే మీషో, షాప్సీ గుర్తొస్తాయి. అయితే ప్రస్తుతం అమెజాన్ కూడా ఇలాంటి సేవలనే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే బజార్ పేరుతో కొత్త సేవలను ప్రారంభించింది. ఇప్పటికే ఈ యాప్ సైతం అందుబాటులోకి వచ్చింది. రూ. 600లోపు విలువ కలిగిన దుస్తులు, వాచ్‌లు, ఫుట్‌వేర్‌ను అందించడమే లక్ష్యంగా కొత్త వ్యాపార విభాగాన్ని ప్రారంభించినట్లు అమెజాన్ తెలిపింది. ఇందులో తక్కువ ధరకే అన్ని రకాల వస్తువులు లభిస్తాయి. చీరలు, కుర్తాలు, షర్టులు, టీషర్టులు, చిన్నపిల్లల దుస్తులు, బెడ్‌షీట్లు, డోర్ కర్టెన్స్, హ్యాండ్ బ్యాగులు వంటి అనేక రకాల వస్తువులను ఇందులో అందుబాటులో ఉంచుతారు. దేశం నలుమూలలా ఉన్న మానుఫాక్చరింగ్ హబ్స్ నుంచి సెల్లర్లు తమ ఉత్పత్తులను ఈ బజార్ వేదికగా విక్రయిస్తారు. అందుకే ఇందులో ధర తక్కువగా ఉండనుంది. అలాగే సెల్లర్ల నుంచి ఎలాంటి ఫీజూ వసూలు చేయడం లేదు. అయితే ఈ వస్తువుల డెలివరీకి మాత్రం 4 నుంచి 5 రజులు పడుతాయిని కంపెనీ తెలిపింది. సాధారణంగా అమెజాన్‌లో అయితే ఆర్డర్ చేసిన రెండు రోజుల్లోనే వస్తువులు డెలివరీ అవుతాయనే విషయం తెలిసిందే. షాప్సీ, మీషో వంటి ఈ కామర్స్ సంస్థలకు పోటీనిచ్చేందుకు అమెజాన్ ఈ సేవలను ప్రారంభించింది. మరి అమెజాన్ బజార్ ఏ మేర సక్సెస్ అవుతుందో చూడాలి.

## పేటీఎం ద్వారా ఫాస్టాగ్ రీచార్జ్ సాధ్యమేనా..?

## ఈ టిప్స్ పాటిస్తే చాలంటున్న నిపుణులు

ఫాస్ట్‌ట్యాగ్ అంటే టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా టోల్ ట్యాక్స్ చెల్లించేందుకు వీలు కల్పిస్తుంది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ ద్వారా టోల్ చెల్లింపును తీసుకుంటుంది. నాలుగు చక్రాల వాహనాలు టోల్ బూత్‌ను దాటినప్పుడు వాటి విండ్‌స్క్రీన్‌పై ఉంచిన ఫాస్ట్‌ట్యాగ్ స్టిక్కర్ ద్వారా ఆటోమేటిక్‌గా టోల్‌ను తగ్గించవచ్చు. ఫాస్ట్‌ట్యాగ్ లేని వ్యక్తులు ఫిబ్రవరి 16, 2021 నుంచి జాతీయ రహదారులపై ఉన్న ప్లాజాల ద్వారా డబుల్ ట్యాక్స్ చెల్లించడం ద్వారా జరిమానా విధిస్తారు. హైవేల్లోని అన్ని టోల్ ప్లాజాల వెలుపల ఉన్న కియోస్క్‌ల వద్ద ఎవరైనా తమ ఫాస్ట్‌ట్యాగ్‌లను రీఛార్జ్ చేసుకోవచ్చు. ఇప్పుడు ఎక్కువ మంది వ్యక్తులు ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా లేదా పేటీఎం వంటి సేవల్లో ఈ-వాలెట్ల ద్వారా రీఛార్జ్ చేస్తున్నారు. పేటీఎంలో రీచార్జ్ ఇలా మీ పేటీఎం ఖాతాకు లాగిన్ అవ్వాలి. 'రీఛార్జ్ బిల్ చెల్లింపులు' ఎంపికను ఎంచుకోవాలి. 'ట్రాన్సిట్' విభాగానికి క్రిందికి స్క్రోల్ చేయాలి. 'ఫాస్ట్‌ట్యాగ్ రీఛార్జ్' ఎంపికను ఎంచుకోవాలి. ఎంపికల జాబితా నుండి ఫాస్టాగ్ జారీచేసే బ్యాంకును ఎంచుకోవాలి. మీ వాహనం నంబర్‌ని అందించి, 'ప్రొసీడ్'పై క్లిక్ చేయాలి. రీఛార్జ్ మొత్తాన్ని నమోదు చేసి, 'ప్రొసీడ్' క్లిక్ చేయాలి. అనంతరం చెల్లింపు ఎంపికను ఎంచుకుంటే అది పేటీఎం వాలెట్ బ్యాలెన్స్, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ లేదా డెబిట్/క్రెడిట్ ద్వారా కావచ్చు. చెల్లింపు పూర్తయ్యాక మీరు చేసిన చెల్లింపు గురించి నోటిఫికేషన్ పొందుతారు. మార్చి 26న పేటీఎం తన యాప్ ద్వారా నేరుగా ఫాస్ట్‌ట్యాగ్ రీఛార్జ్‌లను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఫాస్టాగ్‌ను పేటీఎం వాలెట్‌కి లింక్ చేసినప్పుడు వినియోగదారు ప్రత్యేకంగా ఫాస్టాగ్‌కను రీఛార్జ్ చేయడానికి కాకుండా వారి పేటీఎం వాలెట్‌లో బ్యాలెన్స్‌ను నిర్వహించాలి. ఇది అంతర్రాష్ట్ర ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. అలగే వారి ఫాస్ట్‌ట్యాగ్ బ్యాలెన్స్‌ను ట్రాక్ చేయడంలో ఒక అవాంతరం నుండి తప్పించుకుంటుంది. పేటీఎంలో ఫాస్టాగ్ కొనుగోలు ఇలా ఫాస్టాగ్ ఖాతా తెరిచి బై హెచ్‌డీఎఫ్‌సీ ఫాస్టాగ్ అని సెర్చ్ చేసి ఎంచుకోవాలి కస్టమర్, వాహన వివరాలను పూరించాలి. చెల్లింపు చేసి, మీ ఇంటి చిరునామాకు హెచ్‌డీఎఫ్‌సీకు ఫాస్ట్‌ట్యాగ్‌ని డెలివరీ అవుతుంది. ఎన్‌హెచ్‌ఏఐ పేటీఎం ఫాస్ట్‌ట్యాగ్ వినియోగదారులకు మార్చి 15లోపు కొత్త ఫాస్ట్‌ట్యాగ్‌ని మరొక బ్యాంక్ నుంచి పొందాలని సూచించింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆంక్షలు విధించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో ఎన్‌హెచ్‌ఏఐ ఒక వాహనం, ఒక ఫాస్ట్‌ట్యాగ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. బహుళ వాహనాలకు ఒకే ఫాస్ట్‌ట్యాగ్‌ని ఉపయోగించలేరు లేదా ఒక వాహనానికి బహుళ ఫాస్ట్‌ట్యాగ్‌లను లింక్ చేయలేరు. అందువల్ల కేవైసీ ద్వారా ఫాస్ట్‌ట్యాగ్‌ని ధ్రువీకరించాల్సి ఉంటుంది.





## నన్ను సెకండ్‌హ్యాండ్ అన్నారు : సమంత

నాగచైతన్యతో విడాకుల గురించి సమంత తాజాగా మరోసారి స్పందించారు. డివోర్స్ తర్వాత తనపై చాలా రూమర్స్ వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎన్నో ట్రోలింగ్స్‌ను ఎదుర్కొన్నట్లు చెప్పుకొచ్చారు. కొందరు తనను 'సెకండ్ హ్యాండ్' అని కామెంట్ చేశారని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సమంత మాట్లాడుతూ.. 'విడాకులు తీసుకుంటే దాన్ని జనం ఫెయిల్యూర్‌గా పరిగణిస్తారు. ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం చాలా కష్టంగా ఉంటుంది. పెళ్లైన నాలుగేళ్లకే చైతన్యతో విడాకులు తీసుకున్న తర్వాత నేను ఎన్నో తీవ్రమైన ట్రోలింగ్స్‌ను ఎదుర్కొన్నా. నన్ను కొందరు 'సెకండ్ హ్యాండ్' అని కామెంట్ చేశారు. నాపై చాలా రూమర్స్ వచ్చాయి. ఎన్నో అబద్ధాలు వ్యాప్తి చెందాయి. అవన్నీ నిజం కాదని చాలా సార్లు బయటకు వచ్చి చెప్పాలని అనిపించింది. కానీ చెప్పడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదని ఆగిపోయాను' అంటూ సామ్ చెప్పుకొచ్చింది.



## 27కు రాంగోపాల్ వర్మ విచారణ వాయిదా

ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈనెల 27కు ఏపీ హైకోర్టు విచారణను వాయిదా వేసింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన వ్యవహారంలో రాంగోపాల్ వర్మపై ఒంగోలు, విశాఖ, గుంటూరు జిల్లాలో కేసులు నమోదయ్యాయి. ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసులో పోలీసులు రెండు సార్లు నోటీసులు అందించినా వర్మ విచారణకు హాజరుకాలేదు. దీంతో వర్మ కోసం పోలీసులు హైదరాబాద్, తమిళనాడులో గాలింపు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో హైకోర్టులో ఆర్జీవీ ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ వేశారు. ఆర్జీవీ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరుగగా విచారణ రేపటికి వాయిదా పడింది. ఈ నెల 23న కోయం బత్తూరులో షూటింగ్‌లో పాల్గొన్నట్టు తెలియజేస్తూ.. యాక్టర్లతో దిగిన ఫొటో లను ఎక్స్‌లో ట్వీట్ చేశాడు వర్మ. ఈ నేపథ్యంలో ఏపీ పోలీసులు రాం గోపాల్ వర్మ కోసం కోయంబత్తూరు వెళ్లినట్టు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే వర్చువల్‌గా విచారణకు హాజరవుతారని వర్మ లీగల్ టీం పోలీసులకు తెలియ జేసిన విషయం తెలిసిందే. ఒంగోలు పోలీసులు మొదట హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి కూడా వెళ్లారు. అయితే వర్మ అక్కడ లేకపోవడంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారని తెలిసిందే. వర్మ ఫోన్ స్విచాఫ్ వస్తున్నట్టు కూడా వార్తలు వచ్చాయి.



## ఇక్కడ ప్రతిదీ కష్టమే : కృతిసనన్

ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చితనకంటూ ప్రత్యేకంగా ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కృతిసనన్. తెలుగులో మహేశ్ బాబుతో వన్ నేనొక్కడినే, నాగచైతన్యతో దోచెయ్ సినిమాల్లో మెరిసిన ఈ భామ ప్రస్తుతం హిందీపైనే ఫోకస్ పెట్టిందని తెలిసిందే. ఈ బ్యూటీ 2024 ఈవెంట్‌లో సందడి చేసింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో ఇండస్ట్రీలో నెపోటిజమ్ (బంధు ప్రీతి)తోపాటు తన డ్రీమ్ రోల్ ఏంటో చెప్పుకొచ్చింది. డ్రీమ్ రోల్ గురించి మాట్లాడుతూ.. నాకు సూపర్ ఉమెన్ పాత్ర చేయాలని ఉంది. పూర్తిగా నెగెటివ్ పాత్రలో నన్ను నేను ఆవిష్కరించుకోవాలనుకుంటున్నానని చెప్పింది. నెపోటిజమ్‌కు ఇండస్ట్రీ పెద్దగా బాధ్యత వహించదని నేను భావిస్తున్నా. కానీ ఈ విషయంలో మీడియా, ప్రేక్షకులు చాలా కీలక పాత్ర పోషిస్తారు. కొందరు స్టార్ కిడ్స్ పట్ల మాత్రం మీడియా ఎలా వ్యవహరిస్తుందో ప్రేక్షకులు చూడాలనుకుంటారు. ప్రేక్షకులు ఆ స్టార్ కిడ్స్ పట్ల ఆసక్తి చూపించడం వల్ల వారితో సినిమా చేయాలని ఇండస్ట్రీ భావిస్తుంది. ఇది ఒక సర్కిల్ అని నేననుకుంటున్నానంది. మీరు ప్రతిభావంతులైతే ఇండస్ట్రీకి చేరుకుంటారు. ప్రతిభావంతులు కాకపోతే, ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వలేకపోతే, అక్కడికి చేరుకోలేరు. నేను వచ్చినప్పటి నుంచి ఇండస్ట్రీ నాకు సాదర స్వాగతం పలికింది. మీరు సినిమా బ్యాక్ గ్రౌండ్ నుంచి రానప్పుడు.. మీరు కోరుకున్నది అందుకునేందుకు సమయం పడుతుంది. మ్యాగజైన్ కవర్‌లో చోటు సంపాదించుకోవడానికి కూడా టైం పడుతుంది. కాబట్టి ప్రతిదీ కొంచెం కష్టంతోనే కూడుకుని ఉంటుందని చెప్పుకొచ్చింది.




## సినీ నటుడు శ్రీతేజ్‌పై కేసు నమోదు

ప్రముఖ సినీ నటుడు శ్రీతేజ్‌పై కూకట్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదైంది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని శ్రీతేజ్‌పై ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో శ్రీతేజ్‌పై బీఎన్ఎస్ 69, 115 (2), 318 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. శ్రీతేజ్‌పై గతంలో కూడా ఇదే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శ్రీతేజ్ పెళ్లైయిన మరో వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. అక్రమ సంబంధం విషయం తెలిసి గుండెపోటుతో అప్పట్లో బ్యాంక్ ఉద్యోగి సురేశ్ మృతి చెందాడు. బ్యాంక్ ఉద్యోగి మృతితో గతంలో మాదాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. వంగవీటి, లక్ష్మీస్ ఎన్టీఆర్, పుష్ప ది రైజ్, మంగళవారం, ధమాకా సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీతేజ్ ప్రస్తుతం పుష్ప ది రూల్‌లో కీలక పాత్రలో నటిస్తున్నాడు.

## ఆయన నాకు తండ్రిలాంటి వారు : మోహిని

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ తన భార్య సైరా భానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక రెహమాన్ దంపతులు విడాకులు ప్రకటించిన గంటల వ్యవధిలోనే రెహమాన్ మ్యూజిక్ బృందంలోని బాసిస్ట్ మోహినీ దే కూడా తన భర్తతో విడాకులు ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఇద్దరి మధ్య సంబంధం ఉందని అందుకే విడాకులు తీసుకోబోతున్నారని వార్తలు వచ్చాయి. దీనిపై మోహిని మరోసారి స్పందించారు. రెహమాన్ తనకు తండ్రిలాంటి వారని చెప్పుకొచ్చారు. తనది, రెహమాన్ కుమార్తెలది ఒకే వయసు అని.. ఆయనెప్పుడూ తనని కుమార్తెలానే చూసేవారని తెలిపింది. ఎనిమిదేళ్లుగా ఆయన బృందంలో పనిచేస్తున్నట్లు తెలిపింది. రెహమాన్ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని స్పష్టం చేసింది. ఆయన తనకు తండ్రితో సమానమని స్పష్టం చేసింది. తన కెరీర్‌లో ఆయన కీలక పాత్ర పోషించారని వివరించింది. అలాంటి తమపై ఇలాంటి వార్తలు రావడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి సున్నితమైన అంశాల్లో సానుభూతి లేకుండా నిందలు వేయడం సరికాదని పేర్కొంది. ఇక్కడితో ఈ రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టి.. తమ గోప్యతను గౌరవించాలని కోరింది. ఇద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఈ జంట విడిపోతున్నట్లు ఇటీవలే ప్రకటించారు. 29 ఏళ్ల వైవాహిక జీవితానికి ఇద్దరూ పరస్పర అంగీకారంతో ముగింపు పలికారు. ఇక ఈ దంపతులకు ఖతీజా, రహీమా, అమీన్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ముగ్గురు పిల్లలకు పెళ్లయ్యింది. వైవాహిక బంధంలో ఏర్పడిన భావోద్వేగ క్షణం తర్వాత ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఏఆర్ రెహమాన్ న్యాయవాది తెలిపారు. ఒకరిపై ఒకరికి అమితమైన ప్రేమ ఉన్నా.. ఉద్రిక్తలు, ఆందోళనలు వారి మధ్య గ్యాప్‌ను పెంచాయని.. ఆ అగాధాన్ని పూడ్చేందుకు ఎవరు కూడా సిద్ధంగా లేరన్నారు.



## భయపెట్టేందుకు వస్తున్న వేదిక

బాణం, రూలర్, శివలింగ, కాంచన 3 సినిమాలతో టాలీవుడ్‌లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది వేదిక . ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులతో బిజీగా ఉండగా.. వీటిలో ఒకటి ఫియర్. ఈ సినిమాకు లక్కీ లక్ష్మణ్ నిర్మాత హరిత గోగినేని కథనందిస్తూ దర్శకత్వం వహిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేయగా.. చీకట్లో ముఖంపై చేతులు పెట్టుకొని భయంగా కనిపిస్తున్న లుక్ ఇప్పటికే సినిమాపై అంచనాలు పెంచుతోంది. కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. భయంకరమైన ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి ధైర్యంగా మిమ్మల్ని మీరుసిద్ధం చేసుకోండి. వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుందని తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ఏఆర్ అభి నిర్మిస్తుండగా.. సుజాత రెడ్డి సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. ఆంద్రీవ్ బాబు సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు.







## అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో శ్రీలీల

టాలీవుడ్ యాక్టర్ బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే. బాలకృష్ణ సీజన్ 4లో ఎంటర్‌టైన్ మెంట్ డోస్ పెంచుతూ కొత్త కొత్త సెలబ్రిటీలతో సందడి చేస్తున్నాడు. ఇటీవలే పుష్ప 2 ది రూల్ ప్రమోషన్స్‌లో భాగంగా పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో బాలకృష్ణతో సందడి చేశాడని తెలిసిందే. ఈ ఎపిసోడ్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. భగవంత్ కేసరిలో బాలకృష్ణతో కలిసి నటించిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోకు మంచి ప్రశంసలు దక్కాయి. తాజాగా బాలయ్య, శ్రీలీల మరోసారి సందడి చేయబోతున్నారన్న వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజాగా మరో అతిథిగా డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలను ఫైనల్ చేశారు మేకర్స్. శ్రీలీల అన్‌స్టాపబుల్ తాజా ఎపిసోడ్ షూట్‌లో జాయిన్ అయింది. స్లీవ్ లెస్ టాప్, చీరకట్టులో క్యారవాన్ ముందు హొయలు పోతున్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ శ్రీలీల ఎపిసోడ్ ప్రోమో ఎప్పుడొస్తుందనేది తెలియాల్సి ఉంది. అన్‌స్టాపబుల్ షోలో శ్రీలీల తర్వాత రాబోయే గెస్ట్ నవీన్ పొలిశెట్టి అని ఫిలింనగర్ సర్కిల్ టాక్.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com